VISALANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిస్టర్డు నెం A 193

విశాలాంధ్ర

సంపుటి 6 ★ విజయవాడ సోమవారం 13 జ్యేష్ఠం 1879 [జూన్ 3 1957] ★ సంచిక 62

ఆంధ్ర మోటారు రవాణాపరిశ్రమ
ఆరునెలలు ప్రజోపయోగకర సర్వీసుగా ప్రకటన

హైద్రాబాద్, జూన్ 2

ఆంధ్రలో మోటారు రవాణా పరిశ్రమ ప్రజోపయోగకరసర్వీసుగా ప్రకటించబడింది. ఈ తత్వ్వు నేటినుండి ఆరునెలల పాటు అమలులో వుంటుంది.

అంధులకు బస్సుచార్జీలు తగ్గింపు

అహమ్మదాబాద్, జూన్ 2

అహమ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అంధులకు బస్సుచార్జీలలో నూటికి 25 నుండి 50 వంతుల వరకు తగ్గించింది. ఈ సౌకర్యం జూన్ 5 వ తేదీ నుండి అమలులోకి వస్తుంది.

ప్రణాళిక లక్ష్యాలు తగ్గించకుండా సకాలంలో అమలుజరపాలి

కాంగ్రెస్ కార్యవర్గం తయారుచేసిన తీర్మానంపై ఏ. ఐ. సి. సి. సమావేశంలో చర్చ

ఆహారోత్పత్తి పెంచడానికి భూసంస్కరణలు అవసరమని మరొక తీర్మానం

న్యూఢిల్లీ, జూన్ 2

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను కుదించకుండా, ప్రణాళిక కాలాన్ని పెంచకుండా, దానిని అమలుజరపడం అవసరమని కాంగ్రెస్ కార్యవర్గం, అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో ప్రవేశపెట్టడానికి తయారు చేసిన తీర్మానంలో పేర్కొన్నది. ఆహారోత్పత్తిని పెంచడానికి భూసంస్కరణలు అమలుజరపాలని మరొక తీర్మానంలో కోరింది.

ఈ తీర్మానాలపై నేడు ఎ. ఐ. సి. సి. లో చర్చ ప్రారంభమైంది.

ఆర్థికపరిస్థితిపై కార్యవర్గంతయారు చేసిన తీర్మానంలో ఇలా వుంది:

ప్రథమ పంచవర్ష ప్రణాళిక వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పత్తిని పెంచింది. ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలను కాంగ్రెస్ ఆమోదించింది. సోషలిస్టు సమాజాన్ని నిర్మించే దిశగా ఈ ప్రణాళిక నడవాలని, కాంగ్రెస్ అభిప్రాయపడింది.

ఇటీవల భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు అనుగుణంగానే వుందని కమిటీ భావిస్తోంది. ముఖ్యంగా, సంపద కేంద్రీకరణను తగ్గించడానికై, సంపద, వ్యయాలమీద ప్రభుత్వం వేస్తున్న పన్నులకు హర్షం వెలిబుచ్చుతోంది.

ప్రజల జీవనపరిస్థితులను అభివృద్ధి పరచాలంటే, ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలను సాధించడం కనీస అవసరమవుతుంది. అందుచేత ఈ లక్ష్యాలను కుదించకుండా, ప్రణాళిక కాలాన్ని పెంచకుండా, ప్రణాళికను అమలు జరపడం అత్యవసరం. ప్రణాళికలో ఏవైనా సర్దుబాట్లు చేయదలిస్తే, సోషలిస్టు సమాజ సాధనకు అనుగుణంగానే చేయాలి. ప్రణాళికలో కీలకభాగమైన ఉక్కు, బొగ్గు ఉత్పత్తి, విద్యుచ్ఛక్తి, రవాణాల అభివృద్ధి తప్పనిసరిగా అమలు జరిగేట్లు చూడాలి.

అన్నిరంగాలలో ఉత్పత్తి అధికం చేయాలి. దుబారాను అరికట్టి, పొదుపుచేయడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలు సర్వశక్తులా పాటుపడాలి.

ఆహారోత్పత్తి

ఆహారోత్పత్తిపైచేసినతీర్మానంలో ఇలా వుంది.

ఆహారోత్పత్తి సమస్య ఈదశలో చాలాముఖ్యమైనది. పారిశ్రామికాభివృద్ధికి వ్యవసాయ సరకుల మిగులు అవసరం, ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆహారోత్పత్తి బాగా పెరిగినప్పటికీ, ఆతర్వాత కొన్ని అననుకూల పరిస్థితులవల్ల ఆహారకొరత ఏర్పడింది. ఆహార ధరలు పెరిగాయి.

ప్రజల అవసరాలను తీర్చేందుకు, ద్వితీయ ప్రణాళికను అమలుజరిపేందుకు, ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచడం అవసరం. దీనిని జాతీయ ప్రాముఖ్యంగల అత్యవసర సమస్యగా భావించాలి. ఇందుకై క్రింది చర్యలు తీసుకోవాలి:

ద్వితీయ ప్రణాళికలో సూచించినట్లు, భూసంస్కరణలను అమలు జరపడం ఆవశ్యమైన అన్ని రాష్ట్రాలలో వేగంగా అమలుజరపాలి.

నీటిపారుదల కాల్వలు, గొట్టపు బావులు మున్నగు వాటిని పూర్తిగా వినియోగించుకోవాలి. మైనర్ ఇరిగేషన్ పనులను ఆలస్యం లేకుండా, పొదుపును దృష్టిలో పెట్టుకుని, అమలుజరపాలి.

సాగుకు లాభదాయకమైన బంజరు భూములను సాగులోకి తీసుకురావాలి. సాముదాయక ప్రాజెక్టులలో వ్యవసాయ ఉత్పత్తి ప్రధాన లక్ష్యంగా వుండాలి. పంచాయితీలకు వ్యవసాయోత్పత్తితో సంబంధం వుండాలి.

సౌకర్యమైనంతవరకు, సహకార పద్ధతులను అమలు జరపాలి. గుర్తించదగిన ఉత్పత్తి జరిగిన గ్రామాలకు ప్రత్యేక బహుమతులివ్వాలి.

గ్రామీణప్రాంతాలలో కాంగ్రెస్ వారు చిన్న బృందాలుగా ఏర్పడి, సాముదాయక ప్రాజెక్టులతో సహకరించాలి. వ్యవసాయదారులకు కూడా వారు తోడ్పడాలి.

వర్తకులు, రైతులు ధాన్యాలు నిల్వచేయడం మున్నగు పనులు మానాలి. ధరలు తగ్గించడానికిసహాయపడాలి. అయితే వ్యవసాయదారులకు ప్రోత్సాహం ఇవ్వడానికై ఆహార ధాన్యాలకు కనీస ధర నిర్ణయించాలి.

ఏవైనా ఆపదలు వచ్చినపుడు సర్దుబాటు చేయడానికి, ప్రభుత్వం ఆహార నిల్వలు ఏర్పరచాలి.

ఆహారోత్పత్తి ఉద్యమాన్ని పూనికతో నిర్వహించవలసిందిగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశానికి విజ్ఞప్తి జేస్తోంది. దీనిమీదనే మన ప్రణాళిక విజయం, పారిశ్రామికాభివృద్ధి ఆధారపడుతుంది.

అణ్వస్త్ర పాటవ పరీక్షలపట్ల ఆందోళిన వెల్లడిస్తూ మరొక తీర్మానం రూపొందించారు. పాటవ పరీక్షలను విరమించాలని, లోక్ సభ, రాజ్యసభలు చేసిన తీర్మానాలకు హర్షం ప్రకటించారు. ప్రపంచమంతా వెల్లడవుతున్న నిరసనకు అగ్రరాజ్యాలు తలవొగ్గుతాయని, ఆశాభావం వెల్లడించారు.

ప్రణాళిక నిర్వహణకు ప్రజలపైపడే భారం

ముందే వివరించకపోవడం పొరబాటని నెహ్రూ అభిభాషణ

న్యూఢిల్లీ, జూన్ 2

పంచవర్ష ప్రణాళిక నిర్వహణకై ప్రజలుభారం మోయవలసి వస్తుందని ఈవరకే చెప్పకపోవడం మన పొరపాటు. ఇపుడు వారిముందు హఠాత్తుగా ఈ భారాలను తెచ్చిపెట్టాం అని ప్రధాని నెహ్రూ నేడు ఎ. ఐ. సి. సి. సమావేశంలో చెప్పారు.

ఆర్థిక పరిస్థితి తీర్మానంపై నేడు చర్చ జరిగిన సందర్భంలో నెహ్రూ మాట్లాడుతూ, భారతదేశం నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, దానిని ధైర్యంగా ఎదుర్కోవడానికి తగుమూల్యం చెల్లించాలని అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు.

"ఆర్థిక పురోగమనపథంలో మనం సగందూరం ప్రయాణంచేశాం. ఇక మనం వెనుదిరిగేదిలేదు. వెనుదిరిగితే, ప్రవాహంలోకొట్టుకుపోతాం. ప్రణాళికను అక్కడక్కడా మార్చవచ్చు. కాని మనం అష్టకష్టాలు పడవలసి వచ్చినప్పటికీ, ప్రణాళికలోప్రధానాంశాలు మాత్రం నెరవేరి తీరవలసిందే.

"ఈవిధంగా భారంమోయవలసి వస్తుందని, ధైర్యంగా దానిని ఎదుర్కోవాలని, ప్రజలకు మనం ముందుగానే తెలియజెప్పకపోవడం పొరపాటే. ఇపుడు వారి ఎదుట హఠాత్తుగా ఈ భారం తెచ్చిపెట్టాం. ముందుగా వాటి స్వరూపాన్ని వారికి వెల్లడించలేదు.

"అయితే మన ప్రజలకు సక్రమంగా నచ్చచెప్పితే, వారు విషయాలను గ్రహిస్తారు. ప్రపంచమంతా సంక్షోభంలో పడిపోయిందని, భారతదేశం స్థితికూడా అలాగేవుందని వారికి వివరించాలి. ఈ సంక్షోభంలో మనం వెనకడుగు వేయలేము. ఇక ముందుకు వెళ్ళి, ప్రణాళిక లక్ష్యాలను నెరవేర్చడమే మనం చేయవలసింది."

ఆహార లక్ష్యాల సాధనలో వెనకబడినట్లయితే, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి యావత్తూ ఆగిపోతుందని ఆయన అన్నారు. "ఏది ఏమైనా రెండు మూడేండ్ల తర్వాత, భారతదేశం పురోగమనం దిగుమతి చేసుకోవాదానిపైన రెండేళ్ళ క్రితం ఉపన్యాసంలో చెప్పాను. నాఆశలు వమ్మయిపోయాయని నాకిపుడు విచారంగా వుంది" అని అన్నారు.

కాంగ్రెసు వాదులంతా గ్రామాలకువెళ్లి, ఆహారోత్పత్తి పెంచడంలో ప్రాముఖ్యాన్నిగురించి, వైతాంగానికి చెప్పాలని, నెహ్రూ విజ్ఞప్తి చేశారు. మనం ఒక జాతిగా మనగలగాలంటే, ఆహారోత్పత్తి పెరగాలన్నారు. ఇక్కడ మనంఆహారంపండించకుండా విదేశాలకు డబ్బు ధారపోసి, ఆహారం దిగుమతి చేయడం తనకు ఎంతో బాధకలిగిస్తోందన్నారు.

ప్రతి ఏటా జీతాలు పెంచడానికి ఒక పథకం తయారు చేయాలని శ్రీ థంగల్ ఆజాద్ చేసిన సూచనను నెహ్రూ ప్రస్తావించి, ఈ సూచన నిరుపయోగమన్నారు. జీతాలను పెంచుతామని ఆశ పెట్టినట్లయితే, ప్రణాళిక లక్ష్యాలనుంచి ప్రజలదృష్టి మళ్ళిపోతుందన్నారు. ప్రజలు ఇందువల్ల సంతోషపడితే పడవచ్చుగాని, దేశానికేమీ ఉపయోగం వుండదన్నారు.

"అసలు విషయమేమంటే, ప్రణాళికా భారం మనకు ఆగ్రహం, ఆవేదన కలిగిస్తున్నది. కష్టాలు కావాలని కోరుకునేవారెవరుంటారు?

"ఇప్పటిదాకా, ఈ ప్రణాళికవల్ల లాభాలు మాత్రమే అందరికీ వస్తాయని, ఆశిస్తూ వచ్చారు. ఇపుడు ప్రథమంగా, భారాన్ని ప్రతి ఒక్కరూ మోయాలని మనం గ్రహిస్తున్నాం."

కేరళకుప్రజాస్వామిక శక్తుల సహకారం

బొంబాయి బహిరంగసభలో శ్రీ నంబూద్రిపాద్ అభ్యర్థన

బొంబాయి, జూన్ 1

నూతన కేరళరాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడానికై దేశంలోని ప్రజాస్వామిక శక్తులన్నీ సహకరించాలని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడిక్కడ ఒక బహిరంగసభలో విజ్ఞప్తిచేశారు.

"మా రాష్ట్రంలో మేము ఒక కొత్త పద్ధతిని అమలు జరుపుతున్నామంటున్నారు. ఇందులో సగం మాత్రమే సత్యం. మేము అమలు జరుపుతున్నది నిజంగా కాంగ్రెసు కార్యక్రమమే. కాంగ్రెసు లోకడ ఎన్నో తీర్మానాలు చేసింది. కాని కాంగ్రెసు ప్రభుత్వాలు వాటిని అమలు జరుపలేదు" అని ఆయన అన్నారు.

కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీ నంబూద్రిపాద్ బొంబాయికి రావడం ఇదే మొదలు. ఈ సందర్భంలో నేటి సాయంకాలం శివాజీపార్కులో పెద్ద బహిరంగసభ జరిగింది. బొంబాయి కమ్యూనిస్టు కమిటీ ఈ సభను ఏర్పాటు చేసింది. ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీ ఎస్. ఎస్. మిరాజ్‌కర్ సభకు అధ్యక్షత వహించారు.

శ్రీ నంబూద్రిపాద్ ఉపన్యసిస్తూ, తన ప్రభుత్వానికి ఎట్టి సహాయం అందజేసినా, సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామన్నారు. అంతేకాదు. తన ప్రభుత్వ విధానాలను విమర్శించవచ్చునని, అవసరమైతే వాటిని సవరించుకొంటామని కూడ ఆయన చెప్పారు.

ప్రజాస్వామిక సత్సాంప్రదాయాలకు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి లోకమాన్య తిలక్ పరవడి పెట్టారు. ఆయనకు ముఖ్యవారసులుగావున్న బొంబాయి ప్రజలు నిర్మాణాత్మక సూచనలద్వారా తన ప్రభుత్వానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. "మేము ఎలాంటి తప్పులూ చెయ్యమని చెప్పడంలేదు. అవసరమైతే మా విధానాలను సవరించుకోవడానికి మేము సిద్ధంగావున్నాం" అని ఆయన అన్నారు.

ఆర్థిక విధానం

తన ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రస్తావించి, ఇచ్చుకోగలిగిన వారిపైనే పన్నుల భారం మోపుతామని, పేద తరగతులపై ఆ భారం తగ్గిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలలో ఖర్చు తగ్గించే సూచనే లేదన్నారు. ఖర్చు తగ్గించి వున్నట్లయితే, లేదా రాష్ట్రపతి, మంత్రుల జీతాలలో కోత పెట్టి వున్నట్లయితే అధికపన్నుల భారం మోయడానికి పైతం ప్రజలు ఆయత్తపడేవారన్నారు. మూడవ పథకంగా అలాంటి ఉత్సాహ వాతావరణం కలిగించనంతకాలం ప్రజల అవసరాలు తగ్గించుకొమ్మని చెప్పకూడదన్నారు.

ఆయన తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు:

కేరళ అసెంబ్లీ వెనుకటి సమావేశాలలో ప్రతిపక్షాలవారు ఆందోళన చేసినట్లు, ఆ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు జారీ చేసింది. జూన్ 10 వ తేదీకి దాని గడువు ముగుస్తుంది. రెండవది: ఈ అవకాశాన్ని తీసుకొని భూస్వాములు కౌలుదార్లను చేదఖల్ చెయ్యకూడదనేది ప్రభుత్వ ఆశయం.

కేరళ ప్రభుత్వం చేసిన సంస్కరణలు కేవలం శాసనాలక స్వభావం గలవే. ఈ విషయమై వివిధపార్టీలతో చిన్న భూఖండములతో సంప్రతిస్తాం. ప్రభుత్వం త్వరలోనే ఈ వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తుందన్నారు.

జాతీయకరణ, తదితర అత్యవసర సమస్యలపై తన ప్రభుత్వం ఏవిధానాలను అవలంబించేదీ తాను ఇప్పుడు చెప్పదలచుకోలేదని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు. ఎందుకంటే రాష్ట్ర బడ్జెట్ తయారవుతున్నదని, త్వరలోనే అసెంబ్లీకి సమర్పించబడుతుందని తెలియజేశారు.

భారత పాకిస్తాన్ కాలువ తగాదాల సందర్భంలో ప్రపంచబ్యాంకు ఉపాధ్యక్షుడు ఇలిఫ్, జూన్, 7 వ తేదీన ఢిల్లీ వస్తున్నారు.

పరీక్షకే అలవికాని హైడ్రోజన్ బాంబు

సోవియట్‌లోవున్నట్లు కృశ్చేవ్ప్రకటన

వార్సా, జూన్ 1

సోవియట్‌లో బ్రహ్మాండమైన హైడ్రోజన్ బాంబు ఒకటివుందని, దానిని పరీక్షించాలంటేకూడా భయంపుడుతోందని, కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కృశ్చేవ్ అన్నట్లు చెబుతున్నారు.

పోలిష్ పత్రికా విలేఖరులను కత మాసంలో కృశ్చేవ్ క్రెమ్లిన్‌లో కలుసుకున్నపుడు వారికి ఈ విషయం చెబుతూ, ఈ హైడ్రోజన్ బాంబు ఆర్కటిక్ శీతలాగ్రాన్ని కరిగించి వేయగలుగుతుందని అన్నారట.

ఈ గోష్టివివరాలను పోలెండ్‌లో ఒక అనధికార వార్తాసంస్థ ప్రచురించింది.

"ఈ బాంబు ఎంత పెద్దదంటే సోవియట్‌లో ఇంత భూభాగం వున్నప్పటికీ, దానిని పరీక్షించలేము. కాగా, పసిఫిక్‌లో కూడా దానిని పరీక్షించలేము. ఉత్తరధ్రువం వద్ద దానిని ప్రేల్చినట్లయితే, అక్కడ మంచు శిఖరాలు కరిగిపోయి, సముద్రాలు పొంగిపోయి, ప్రపంచమే మునిగిపోతుంది" అని కృశ్చేవ్ చెప్పారట.

ఉత్తరాగ్రంవద్ద మంచుశిఖరాలు కరిగినట్లయితే, సముద్రాల మట్టం 70 అడుగుల మేర పెరుగుతుందని, లండన్, న్యూయార్కులలాంటి నగరాలు మునిగిపోతాయని శాస్త్రజ్ఞులు అంచనా వేశారు.

ఇట్టి బాంబు ఒక్కదానితో, బ్రిటన్‌నుగాని, ఫ్రాన్స్‌నుగాని బూడిదదేసి వేయవచ్చునని కృశ్చేవ్ చెప్పారట. సోవియట్ యూనియన్‌లో ఎక్కడో ఉత్తరాన మారుమూల ప్రేల్చినప్పటికీ, స్కాండినేవియా ప్రాంతమంతా భస్మీపటలమైపోతుందని, కృశ్చేవ్ చెప్పారట.

విదేశ మారకం పరిస్థితి క్లిష్టంగా వున్నందున 20 రకాలైన ఉక్కు సరకుల దిగుమతులపై ప్రభుత్వం నిషేధాలు పెట్టింది.

విదేశాలకు ఎగుమతి చేసే చేనేత వస్త్రాలు

నాణ్యాపు ముద్రవేసి పంపుతారట

['విశాలాంధ్ర' విలేఖరి]

హైద్రాబాద్, జూన్ 2

విదేశాలకు ఎగుమతిచేసే చేనేత వస్త్రాలపై నాణ్యాపు ముద్ర వేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యతీసుకుంటున్నది. అయితే ఇది విచ్ఛిన్నకమేకాని నిర్బంధంకాదు.

ఇతరదేశాలకు ఎగుమతిచేసే చేనేత వస్త్రాల నాణ్యాన్ని పరిశీలించడానికై ఇదివరలో కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ చేసిన సూచనలను నేడిక్కడ జరిగిన అఖిల చేనేతబోర్డు స్థాయీసంఘ సమావేశంలో చర్చించి, సూత్రప్రాయంగా ఆమోదించారు.

ఉత్తరప్రదేశ్ చేనేత కేంద్రాలలో వస్త్రాల నాణ్యాన్ని పరిశీలించడానికై రాష్ట్ర ప్రభుత్వం అధికారులను నియమించింది. ఈ పద్ధతినే దేశమంతటా అమలుజరపాలని అఖిలభారత చేనేత బోర్డు స్థాయీ సంఘ సమావేశంలో నిర్ణయించారు.

అఖిలభారత చేనేత వస్త్రాల సహకార మార్కెటింగ్ సొసైటీ నిన్న ఇక్కడ సమావేశమై న్యూయార్క్‌లో చేనేత ఎంపోరియం ఒకటి తెరవాలని నిర్ణయించింది. ఢిల్లీ, కలకత్తా, బెంగుళూరు, హైద్రాబాద్‌లలోకూడ చేనేత ఎంపోరియమ్‌లు పెట్టడానికి తగు చర్యలు తీసుకొంటారు.

ఈ సొసైటీకి శ్రీ మూచాని సోమప్పగారు అధ్యక్షులుగా, అఖిలభారత చేనేతబోర్డు అధ్యక్షులు శ్రీ ఎస్. నంజప్ప (వి. సి. ఎస్.) గారు ఉపాధ్యక్షులుగా ఎన్నికైనారు.

గ్రామోద్యోగుల వారసత్వ హక్కులు

కొనసాగనివ్వాలని తెలంగాణా గ్రామోద్యోగుల సభ తీర్మానం

హైద్రాబాద్, జూన్ 2

గ్రామోద్యోగులకు వారసత్వ హక్కులు యథాప్రకారం కొనసాగనివ్వాలని నేడిక్కడ తెలంగాణా గ్రామోద్యోగుల సంఘ కార్యకర్త సమావేశంలో తీర్మానించారు.

తెలంగాణా గ్రామోద్యోగులు ఇప్పటివరకు రూమిశిస్తు, తదితర ప్రభుత్వాదాయంలో నూటికి పదివంతుల కమిషన్ తీసుకొని పనిచేస్తున్నారు. ఈ పద్ధతిని ఇకముందుకూడ కొనసాగనివ్వాలని ఈ సమావేశం కోరింది.

గ్రామోద్యోగులకు ఇప్పుడు పనిభారం ఎక్కువైందని, దీనిని తగ్గించాలని తీర్మానం చేశారు.

నేటి సాయంకాలం 4 గంటలకు మహాసభ ప్రారంభమవుతుంది. మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారు సభలో పాల్గొంటారు. (వి. వి.)

"మనజీవిత కాలంలో సోషలిజం": శ్రీ కృష్ణమాచారి నినాదం

న్యూఢిల్లీ, జూన్ 2

"మన జీవితకాలంలోనే సోషలిజం" అనే నినాదాన్ని నేడు ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ప్రతిపాదించారు.

తన కొత్తపన్నుల ప్రతిపాదనలను ఆయన సమర్థించుకుంటూ, తాను రూపొందించిన పన్నుల వ్యవస్థ ప్రైవేట్ రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తూనే, "మనల్ని సోషలిజం వైపుకు తీసుకువెళ్ళడానికి ఉపకరిస్తుంది" అని అన్నారు.

'పార్టీ సమావేశాలకై సభనుతొందరపెట్టరాదు'

రాజ్యసభలో సభ్యుల ఆక్షేపణ

న్యూఢిల్లీ, జూన్ 1

కాంగ్రెసుపార్టీ సమావేశాల కోసం రాజ్యసభ చర్చలను వాయిదా వేయడానికి వీలులేదని, నేడు ప్రతిపక్షసభ్యులుఆక్షేపణ తెలియజేశారు

సభ్యులు లేవు ప్రసంగాలకు పరిమితి పెట్టుకోవాలని సభాధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణన్ నేటి ఉదయం సూచించినపుడు, ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. కాంగ్రెసువారు ఏ. ఐ. సి. సి. సమావేశానికి హాజరవుతారని, సభ చాలసేపు కూర్చుంటే, కోరం వుండకపోవచ్చునని, శ్రీ రాధాకృష్ణన్ అనగానే, పండిత కుంజ్రూ ప్రభృతులు అందుకు అభ్యంతరం తెలియజేస్తూ, ప్రభుత్వం కోరం వుండేట్లు చూడాలని, పార్టీ సమావేశాల కోసం, సభవారిని తొందరపెట్టరాదని అన్నారు.

ఇందుమూలంగా ఒక గంటలోనే మొత్తం కార్యకలాపమంతా ముగించాలనుకున్నవారు పదిగంటలసేపు కూర్చోవలసి వచ్చింది.

బొంబాయి స్థానిక రైళ్ల ఢీకోలు

ఏడుగురి మరణం యాభైమందికి గాయాలు

బొంబాయి, జూన్ 2

నేటి వుదయం బొంబాయిలో స్థానికంగా నడుస్తున్న రైళ్ళు ఒకదాని నొకటి ఢీకొన్నాయి. తత్ఫలితంగా ఏడుగురు చనిపోయారు. యాభైమందికి పైగా గాయపడ్డారు. వారిలో కొందరిపరిస్థితి ప్రమాదకరంగా వుంది.

ప్రమాదం జరిగిన కంటనే అయిదుగురు చనిపోయారు. ఆస్పత్రిలో ఇద్దరు చనిపోయారు.

మొదటి రైలు డ్రైవరు, రెండవ రైలుగార్డుకూడ గాయపడ్డారు.

కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు అసఫలీ అజ్జల్ ఖాదీ జమ్మూ కాశ్మీర్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులైనారు.

పంచబాణకల్ప

కుష్ఠు మిశ్రమము, నిస్సత్తువ, నరములబలహీనత, దవ, బ్లడ్ ప్రజర్, వాతరక్తము, ఆయాసము, మధుమేహము మొదలగు అన్ని వ్యాధులనుహరించును. రక్తపుష్టిని, గుండెకు బలమును యిచ్చును. మూత్ర దోషములను పోగొట్టును. ఆయుర్వేద పద్ధతులపై శాస్త్రీయముగా తయారు కాబడినది కేటలాగు ఉచితం.

20 రోజుల మందు 40 పొట్లములు. రు. 15-0-0. వి. పి. 1-0-0.

ఇండియన్ మెడిసిన్‌హౌస్, విజయవాడ-2 ఫోన్: 818

హేవిళంబినామ సంవత్సర
ఆంధ్రమాస జ్యేష్ఠశుద్ధ
పంచమి ఉ. 7-48
షష్ఠి తె. 5-21
ఆశ్లేష రా. 2-28

విశాలాంధ్ర

13 జ్యేష్ఠం 1879
సోమవారం 3-6-57

ఆహార ధరల కంట్రోలు అధికారం

ఆహార ధాన్యాలను లాభాపేక్షతో నిల్వచేసే వ్యాపారస్తులను నిరుత్సాహపరచేందుకు, ధరలను కంట్రోలు చేసేందుకు ప్రభుత్వానికి అధికారమిచ్చే బిల్లు లోక్‌సభలో ఆమోదించబడింది. దీనిని ప్రభుత్వం ఎంతవరకు సక్రమంగా అమలుజరిపి, ఆహార ధాన్యాల ధరలను అదుపులో వుంచగలుగుతుందో చూడవలసి వుంది

ఏమంటే ఆహార ధరలు ఈ సంవత్సరం విపరీతంగా పెరగడానికి బాధ్యత ప్రభుత్వంపై కూడావుంది ధరలపెరుగుదలను అరికట్టేందుకు గత సంవత్సరం మధ్యకాలంలో ఆహారం నిల్వ జేసే వ్యాపారస్తులకు బ్యాంకులు అప్పు లివ్వరాదని ప్రభుత్వం నిషేధించింది. పంటల తరుణం వచ్చినప్పుడు రైతులనుండి ప్రభుత్వమే ధాన్యం కొని గోదాములలో నిల్వ చేస్తుందనీ, అవసరమైనపుడల్లా మార్కెటులో విడుదలచేసి ధరలను అదుపులో వుంచుతామనీ ఆహారమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ అపుడు వాగ్దానం చేశారు కాని తరువాత ప్రభుత్వం ఆ వాగ్దానంపై నిలబడలేదు. నిల్వ వ్యాపారస్తుల ఒత్తిడికి లొంగి, తీరా పంటల సమయం వచ్చాక బ్యాంకులపై వున్న నిషేధాన్ని తొలగించింది. నిల్వవ్యాపారస్తులు బ్యాంకుల నుండి అప్పులతో ధాన్యంకొని నిల్వచేశారు. క్రమంగా ఆహార ధరలు నూటికి 50 వంతులు ఖస్తా 1కి 10 రూపాయలవరకు పెరిగాయి.

అందుచేత ఈ సంవత్సరం ఆహార ధరల పెరుగుదలకు ప్రభుత్వ విధానమే కారణమని చెప్పవచ్చు. ఈ స్వయం కృతాపరాధం నుండి బయటపడేందుకు జీవితావసర వస్తువుల చట్టాన్ని సవరించుతూ పార్లమెంటులో ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. దీనివలన నిల్వవ్యాపారస్తులనుండి ఆహారధాన్యాలను సేకరించడానికి, ధరలను అదుపులో వుంచడానికి ప్రభుత్వానికి అధికారం లభించుతుంది నిల్వ వ్యాపారస్తులనుండి సేకరించిన ధాన్యానికి హాతచట్టం ప్రకారమైతే మార్కెటు ధర చెల్లించవలసివుండేది. సవరణవల్ల గత మూడు నెలల్లోవున్న సగటు ధరపై ఆధారపడి ప్రభుత్వం ధాన్యసేకరణ ధరను నిర్ణయించవచ్చు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించడానికి 'లా' కోర్టులకు అధికారం వుండదు.

లోక్‌సభ చర్చలలో మాట్లాడుతూ, ఆహారమంత్రి శ్రీ జైన్ రైతులను, చిన్న వర్తకులను వేధించడం ప్రభుత్వ వుద్దేశ్యం కాదన్నారు. విపరీత లాభాలు గుంజాలని దురాశతో కూడబెట్టిన పెద్దవ్యాపారస్తుల నిల్వలను బయటికి లాగడమే తమ ఆశయమన్నారు. ఈ బాధ్యతలను ప్రభుత్వం ఎంతవరకు సక్రమంగా నెరవేరుస్తుందో చూడవలసివుంది.

గత సంవత్సరం బ్యాంకు అప్పులను నిల్వ వ్యాపారస్తులకు నిషేధించినపుడు, పంటల తరుణంలో ప్రభుత్వమే ధాన్యం కొని గోదాములలో నిల్వచేస్తుందన్నప్పుడు ఆహార మంత్రిగారు అభినందించాము. కాని ప్రభుత్వంఆ వాగ్దానాలనుభగ్నం చేసి, నిల్వవ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలకు క్షుధార్తులైన ప్రజానీకాన్ని అప్పగించినపుడు తీవ్రంగా నిరసించాము.

ప్రభుత్వ అపరాధంవల్ల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇపుడు ధరలను అదుపులో వుంచడానికి ప్రభుత్వానికి పార్లమెంటు ప్రత్యేకాధికారాలను ఇచ్చింది గతంలో చేసిన తప్పును సరిదిద్దుకోడానికి ప్రభుత్వానికి పార్లమెంటు అవకాశమిచ్చింది.

ఈసారైనా కేంద్రప్రభుత్వం, ఆహారమంత్రి ప్రజాశ్రేయస్సుకు అనుగుణ్యంగా ఈ అధికారాలను వినియోగించుతారా! ఆహార ధరలను బీదప్రజలకు అందుబాటులో వుండేవిధంగా అదుపులో పెడతారా!

భారత మహిళా లోకంలో జాగృతి

ఆర్థిక, సాంఘిక, రాజకీయాది హక్కులకై కృషి చేస్తున్న జాతీయ మహిళా సమాఖ్య పుట్టుపూర్వోత్తరాలు

శ్రీ వీరేశలింగం పంతులు, భండార్కర్‌ల ఒరవడిలో మహిళాభ్యున్నతికై కృషిచేయడమే భారత జాతీయ మహిళా సమాఖ్య ఆశయం. అందుకోసం భారతదేశంలో మహిళా ఉద్యమం ఎలా పనిచేస్తోందో యీ వ్యాసంలో వివరించబడింది.

జూన్ 6 వ తేదీనుండి 9 వ తేదీ వరకు విజయవాడలో అఖిలభారత మహిళా జాతీయ మహాసభ జరుగుతోంది. మనదేశం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న తరువాత ఒక దశాబ్దం గడిచిపోయింది. మొదటి తొంభవ్వ ప్రణాళిక ముగిసి, దేశాన్ని పారిశ్రామికం చేయాలనే లక్ష్యంతో కొనసాగింపబడుతున్న రెండవప్రణాళికా కాలముకూడ దాదాపు సగభాగం గడిచిపోయింది. సోషలిస్టు తరహా సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తోంది. యావత్తు ప్రజానీకము రెండవ ప్రణాళిక విజయవంతం కావాలనీ, దేశంలో తిండికీ, గుడ్డకూ కరువు లేకుండా పోవాలనీ తహతహ లాడుతున్నారు. ఎక్కడ చూచినా యీరోజు ప్రజలలో సోషలిజం సాధిస్తామనే ప్రభుత్వ ప్రకటనలపై నంపెడంత ఆశ ఒకవైపున, ధరలు మళ్ళీ అంటూ పెరిగి ఆహార ధాన్యాల ధరలు అందుబాటులో లేనందువల్ల కొనుగోలుశక్తి నశించి దినమొక గండంగా తయారైన బాధ మరొకవైపునాక్రమిస్తాయి.

ఇలాంటి పరిస్థితులలో జనబాహుళ్య సంక్షేమానికి ప్రాతినిధ్యం వహించు అఖిలభారత మహిళా మహాసభ జరగడం ఎంతో ప్రాముఖ్యమైన విషయం. యీ మహాసభ మహిళల ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులను సాధించడానికి దేశాన్ని పారిశ్రామికంగా పటిష్టం చేయడానికి, సమగ్రమయిన కార్యక్రమం తీసుకుంటుందని ఆశించుదాం. ఈ సందర్భంలో భారతీయ మహిళా వుద్యమాన్ని ఒక పర్యాయం దృష్టిపథంలోకి తెచ్చుకుందాం.

భారతీయ మహిళలలో జాగృతి

జాతీయ స్వాతంత్ర్య పోరాట శక్తుల బలాభివృద్ధికి అనుగుణ్యంగా, భారతదేశ మహిళలలో జాగృతికూడ అభివృద్ధి చెందింది. స్వాతంత్ర్య పోరాటశక్తుల అభివృద్ధి క్రమంలో కన్పించే దళాలన్నీ మహిళల జాగృతికి సంబంధించిన స్థాయిలోనేమి, వుద్యమం యొక్క స్థాయిలోనేమి తప్పకుండా కన్పిస్తాయి.

పందొమ్మిదవ శతాబ్దంలో, సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం బయల్దేరడానికి పూర్వమే పాశ్చాత్యీకరణకతా ప్రభావంవల్ల భారతదేశంలోని విద్యాధికులలో లిబరల్ ఆలోచనా విధానం పెంపొంది అందుకు అనుగుణ్యంగా అనేక రూపాలలో సాంఘిక సంస్కరణోద్యమాలు తలెత్తాయి. ఆ సంస్కర్తలలో, ఆటు దినదినం బ్రిటిష్ ప్రభుత్వసహాయంతో వ్యాపిస్తున్న క్రిస్టియను మతమునుండి, ఇటు అంతరంగికంగా పెచ్చరిల్లిపోతున్న మూఢనమ్మకాల భారినుండి హిందూమతంయొక్క పవిత్రతను కాపాడి ఉద్ధరించాలనే లక్ష్యంతో వ్యవహరించినవారూ వున్నారు. పాశ్చాత్యీకరణకతా ప్రభావంపడటంవల్ల హిందూమతంలో వ్యాపించిన మూఢనమ్మకాలపట్ల, ఆచారాలపట్ల విరక్తిచెంది అలాంటి ఆచారాలను, నమ్మకాలను అవసరయితే శాస్త్రాలనుసైతం ధిక్కరించి ప్రతిఘటించడంద్వారా సమాజాన్ని సంస్కరించాలనే లక్ష్యంతో కృషిసల్పిన ఉదారవాదులూ (లిబరల్స్) వున్నారు.

పై సంస్కర్తలు కొనసాగించిన పలుముఖమైన సంస్కరణ కార్యక్రమాలలో మహిళల సాంఘిక అభ్యున్నతికై కృషిచేయడం ఒకటి. మత దృష్టిలోనే అయితా 19 వ శతాబ్దంలో మహిళా లోకంలో జాగృతి కల్గించి వారి సాంఘిక అభ్యున్నతికై పాటుపడిన వారిలో రాజా రామమోహనరాయ్‌నీ, వారిచే స్థాపించబడిన బ్రహ్మ సమాజాన్ని మొట్టమొదట పేర్కొనాల్సి వుంటుంది. ఆ నాటికి వ్యాప్తిలో వున్న అతిదారుణమయిన సాంఘికాచారం సహగమనము. ఆ సహగమన విధానాన్ని నిర్మూలించడానికి రామమోహనరాయ్ ఎనలేని కృషిచేశారు. అలానే వారి అనుచరులు కేశవ చంద్రసేన్ వగైరాలు స్త్రీ విద్యను ప్రోత్సహించారు. ఆడపిల్లలకు ప్రత్యేక విద్యా సంస్థలు నెలకొల్పారు. 1872 లో సివిల్ వివాహ చట్టం రావడానికి బ్రహ్మసమాజం వారి కృషి ప్రధానం అలానే మత విశ్వాసాల లోతు పాతులెలా వున్నా ఆర్యసమాజంవారు కూడ ఆనాడు మహిళలలో వ్యాపించి వున్న మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేశారు.

ఇక లిబరల్ భావాలతో సనాతనాచారాలను ఎంతో పట్టుదలతోను ధైర్యసాహసాలతోనూ ఎదుర్కొని, అనేక తరతరాలనుండి సాంఘిక సంస్కరణకొరకు ముఖ్యంగా మహిళల అభివృద్ధికొరకు కృషిచేసిన మహాపురుషులు మరికొందరున్నారు. యీ విషయం ఆంధ్ర ప్రజానీకానికి వీరేశలింగం పంతులుగారు వెంటనే గుర్తుకొస్తారు. హిందూమతం పేరుతో మహిళల పాతుకుపోయిన మూఢనమ్మకాలన్నిటినీ వారు ఒంటరిగా నిలబడి ప్రతిఘటించారు అందుకొరకు ఎన్నో బాధలు పడ్డారు. సనాతనాచారాలు గల ఛాందసులను ఎదుర్కొని వితంతు వివాహాలను సమర్థించారు. శాస్త్రసమ్మతమని ఒప్పించారు. ఆంధ్ర శిశుసంఘాలు స్థాపించి వితంతు వివాహాలు స్వయంగా జరిపించారు వీరి రచనలు, ఆచరణ, ఆంధ్రదేశంలో ముఖ్యంగా మహిళా లోకంలో ఎంతో చైతన్యాన్ని కల్గించాయి. ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకు మహిళాభ్యున్నతికై జరుగుతున్న మహోద్యమానికి ఒరవడిపెట్టింది శ్రీ వీరేశలింగం పంతులుగారే. ఆంధ్ర మహిళాలోకం వారి కెంతయినా ఋణపడివుంది.

ఆంధ్రదేశంలో శ్రీ వీరేశలింగం పంతులుగారిలాగానే యితర రాష్ట్రాలలో శ్రీ భండార్కర్, చింతామణి, సుబ్రహ్మణ్య అయ్యర్, నరేంద్రనాథ్ సేన్, లాలాబాయిజీవాఖ్, రామ్ కలీ చౌదరీ మొదలైన మహా పురుషులు మహిళల సాంఘికాభివృద్ధి కొరకు అమోఘమైన కృషి చేశారు. వీరందరికీ లక్ష్యం ఒకటే. వీరికి దేశవ్యాపితమయిన సంఘ నిర్మాణమైతే లేదుకాని, 1880 - 1900 సంవత్సరాల మధ్య సంవత్సరానికొక పర్యాయం "సాంఘిక మహాసభల" పేరుతో 14 సార్లు సమావేశమైనారు. ఆ సమావేశాలలో జర్గినకార్యక్రమాలపైన పరిశీలించుకొని భవిష్యత్ కార్యక్రమం నేనుకుంటూ ఉండేవారు. శాస్త్రం అంగీకరిస్తుందా? లేదా? అనే విధానాదు పరిశీలనలోచన. శాస్త్రం సాంఘిక అభివృద్ధికి ఆటంకంగా తయారయితే దాన్ని ధిక్కరించాలనేవారి అభిమతం. అలానే వారు కృషి చేశారు. పర్యవసానంగా మహిళాలోకంలో అపూర్వచైతన్యం కల్గింది. భారతదేశంలో నిర్మితమయిన మహిళా వుద్యమానికి ఆ సంస్కర్తల పవిత్రకృషియే పునాదిగావుంది.

జాతీయోద్యమము-స్త్రీలు

20 వ శతాబ్దంలో భారత ప్రజానీకంలో స్వాతంత్ర్య వాంఛ పెంపొందింది. గాంధీజీ నాయకత్వం క్రింద కొనసాగింపబడిన 1920 సత్యాగ్రహంలో ఎంతో మంది స్త్రీలు దేశవ్యాపితంగా పాల్గొన్నారు. ఆధునిక భారత చరిత్రలో స్త్రీలు, పురుషులు ఒకరితరసమఒకరు నిలబడి దేశ స్వాతంత్ర్యం కొరకు దేశవ్యాపితంగా పోరాడిన మొదటి సంఘం ఉద్యమాలలూ, జాదాపు 200 జరుగుతున్నాయి. దీంతో భారతదేశంలో మహిళా వుద్యమం ఒకస్థాయికి వచ్చింది. యీ సంఘాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. భారతమహిళల గూర్చి భోగట్టా కావాల్సివచ్చినా, మరేసందర్భం వచ్చినా ఐక్యరాజ్య సమితి యీ సంఘాన్నే సంప్రదిస్తుంది.

"యంగ్ వుమెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్" పేరుతో మరొక అఖిలభారత సంఘం ఉంది. దీని ఆధ్వర్యంక్రింద చక్కటి హాస్టల్సు చాలవోట్లనిర్వహించబడుతున్నాయి.

స్త్రీలలో విద్యాభివృద్ధి జరిగి పాలమంది పట్టభద్రులు తయారు కావడంతో "ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ వుమెన్" అనే సంస్థ ఒకటి నిర్మింపబడింది. దీనికి ఏడు రాష్ట్రాలలో శాఖలున్నాయి. పురుషులతోపాటు స్త్రీలకు విద్యా, ఉద్యోగ సంబంధమైన విషయాలలో సమాన హక్కులకొరకు ఈ ఫెడరేషన్ కృషి చేస్తుంది.

యీ సంఘాలే కాకుండా యుద్ధం రోజులలో స్థాపింపబడిన "అఖిల భారత ఫుడ్ కౌన్సిల్" ఒకటి వుంది. యుద్ధం మూలంగా ఆహారకొరత ఏర్పడినరోజులలో యీ సంస్థ గృహిణులకు చక్కటి సలహాలు యిస్తూ ఆహారసమస్యా పరిష్కారానికై కృషి చేసింది. అలాగే అఖిలభారత మహిళా ఉద్యమాన్ని గూర్చి ఆలోచించేప్పుడు 1944 లో స్థాపించబడిన "కస్తూర్బా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్టు"ను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

పై సంఘాలన్నీ స్త్రీలు పెద్దయెత్తున రాజకీయాలలో పాల్గొనేందుకు, పురుషులతోపాటు సాంఘికంగా సమాన హక్కులు సాధించడానికీ మహిళలలో చైతన్యం కల్గిస్తూ వచ్చాయి. యుద్ధం వచ్చేంతవరకూ పై సంఘాలన్నింటిలోకీ, దేశవ్యాపితంగా నిర్మాణంకలిగి, నారీలోకంతో యెక్కువ సంబంధాలు కలిగి సజీవంగా పనిచేస్తూవున్న సంఘం "అఖిల భారతమహిళామహాసభ"యే. ఈ సంఘానికి కాంగ్రెసు మద్దతు ఉంది. విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృతకౌర్ లాంటి ప్రసిద్ధ మహిళామణులు, కాంగ్రెసు కార్యకర్తలూ చాలమంది ఆ సంఘంలో వున్నారు.

యుద్ధం - మహిళాఉద్యమం

1932 సత్యాగ్రహం తరువాత స్వాతంత్ర్యపోరాట శక్తులలో అతివాద భావాలు వ్యాపించాయి. దేశంలో సోషలిస్టుభావాలు పెంపొందుతూ వచ్చాయి. ప్రజానీకంలో వర్గచైతన్యం అభివృద్ధి చెందుతూ వచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం కావటంతో పైపరిస్థితులు మరింత ముందుకు పోయాయి. యుద్ధం మన దేశంలో ప్రత్యక్షంగా జరగకపోయినా దాని దుష్ఫలితాలను మనం చాల అనుభవించాం. ధరలుకూడ విపరీతంగా పెరిగిపోయాయి. దొంగమార్కెటుతో ప్రజల జీవితం దుర్భరమైపోయింది. రైతులపై పన్నులు పెరిగాయి కార్మికులకుధరల కనుగుణ్యంగా జీతాలు పెరగలేదు. జీవితం విలువతో పోలిస్తే కూలిరేటు పడిపోయింది. మధ్యతరగతి ప్రజానీకం తిండిగింజలు కొనుక్కోగల్గిన స్థితిలో లేకుండాపోయారు. ఒకవేళ అలానే కొనుక్కోవాలనుకున్న మార్కెటులో తిండిగింజల కొరత యేర్పడిపోయింది. ఆకలిచావులు సర్వసామాన్యమైనాయి. దీని అంతటి దరుదుదశయే 30 లక్షల మందిని పొట్టన పెట్టుకొన్న బెంగాలు కరువు ఇలాంటి స్థితిని భారతప్రజలు యుద్ధం రోజులలో యెదుర్కొనాల్సి వచ్చింది. ఈ దుస్థితిని ఎదుర్కొనేందుకు అతివాదశక్తుల ప్రోత్సాహంతో దేశంలో నలుమూలలా వర్గ సంఘాలు బలవత్తరంగా నిర్మింపబడ్డాయి. అదే సమయంలో ఈ సమస్యలన్నిటినీ సూచారవతో జోక్యం కల్గించుకునేందుకు "అఖిల భారత మహిళా మహాసభ" ముందుకు రాలేదు. అఖిల భారత సంఘం యేదో ఒక రూపంలో దాని స్థానిక శాఖలు కదిలినా ఏ మాత్రం కదలి పనిచేసేవిగాలేవు. అందువల్ల యుద్ధం మూలంగా ఆర్థిక చిక్కులకు గురియైన రైతు, మధ్యతరగతి, కార్మిక స్త్రీల యిబ్బందులను పరిష్కరించడానికి దేశంలో అతివాద శక్తుల ప్రోత్సాహంతో విభిన్నమైన పేర్లతో ఎక్కడికక్కడ మహిళా సంఘాలు వెలిశాయి.

ఆంధ్ర

ఇదే సమయంలో ఆంధ్ర రైతాంగంలోకి కూడా మహిళా సంఘం వ్యాపించింది. 1938 లోనే కృష్ణాజిల్లా మహిళా సంఘం స్థాపించబడింది. ఆ తరువాత చుట్టుకొన్ని జిల్లాలలో జిల్లా మహిళాసంఘాలు స్థాపించబడ్డాయి. చివరకు ఆంధ్ర రాష్ట్ర మహిళాసంఘం నిర్మింపబడింది. ఆంధ్రదేశంలో మహిళా సంఘం ప్రధానంగా సాంఘిక సంస్కరణల కొరకు పనిచేసింది. హిందూ కోడ్ సవరణ బిల్లుకై ఆంధ్ర మహిళాలోకంలో పెద్దయెత్తున ప్రచారం చేసింది. అందుకు అనేక పర్యాయాలు, సంతకాల సేకరణ వుద్యమాన్ని నడిపింది. అజ్ఞానంతోను, మూఢ విశ్వాసాలతోను వుండే గ్రామీణ మహిళలలో ప్రసూతి, శిశుపోషణ మొదలగు విషయాలపై శాస్త్రీయ పద్ధతులు అలవరచుకోవేందుకు కృషిచేసింది. కోళ్ళ పెంపకం, చేతిపనులు మొదలగు విషయాలను ప్రోత్సహించింది. చాలా గ్రామాలలో రీడింగు రూములు ఏర్పరచి పత్రికా పఠనం ద్వారా రాజకీయ చైతన్యాన్ని పెంపొందించింది. 1942 లో యువజనసంఘాలతో కలసి వయోజన విద్యా ప్రచారం చేసింది. ఆదర్శమైన గృహిణులుగా జీవిస్తూ సాంఘికంగానూ, ఆర్థికంగానూ పురుషులతో పాటు సమానహక్కులకొరకు సాధించుట ప్రయత్నించింది. అలానే పట్టణాలలోమహిళా సంఘాలు ప్రధానంగా ఆహారసమస్యపై కృషి చేశాయి. చౌకడిపోలకొరకు ఆందోళనచేశాయి. చౌకడిపోలవద్ద క్యూపద్ధతిలో జనాన్ని నిలబెట్టి రద్దీలేకుండా అందరికీ బియ్యం అందేలా చేయడం, కిరసనాయిలు పంచడం, ఆకలియాత్రలు పెద్దయెత్తున నడపడం మొదలగు విషయాలలో పట్టణ మహిళాసంఘాలు కృషి చేస్తూ వచ్చాయి.

బెంగాల్

బెంగాల్‌లో ఆత్మరక్షా సమితి పేరుతో మహిళా ఉద్యమం ప్రారంభమయింది. ఈ సంఘం ప్రధానంగా కరువు సమయంలోనే పుట్టింది. అందువల్ల ఆంధ్రరాష్ట్ర మహిళా సంఘం ప్రధానంగా సాంఘిక సంస్కరణకై ఎలా కృషిచేస్తూ వచ్చిందో అలా బెంగాలులో ఆత్మరక్షా సమితి ప్రధానంగా కరువు నివారణకొరకూ, ఆహార సమస్యా పరిష్కారం కొరకు కృషిచేస్తూ వచ్చింది. బెంగాల్, పంజాబు రాష్ట్రాల నెదుర్కొన్న మరొక జటిల సమస్యకూడా ఉంది. అదే కాందిశీకుల సమస్య. బెంగాల్లో ఆత్మరక్షాసమితి ప్రధాన కార్యక్రమంలో కాందిశీకుల సమస్య ఒకటి. వారికి పునరావాస పరిస్థితులు కల్పించడం, ఉద్యోగాలు సాధ్యమైనంతవరకూ చూడడం వగయిరా విషయాలలో ఆత్మరక్షా సమితి కృషిచేసింది. ఈ సంఘం బెంగాల్‌లో కార్మిక, మధ్యతరగతి మహిళా లోకంలో చాల వ్యాప్తిచెందింది.

త్రిపురా

త్రిపురాలో "గణతంత్ర నారీ సమ్మేళన్" అనే పేరుతో మహిళా సంఘం స్థాపితమయింది. అక్కడ ఈసంఘం చాల పలుకుబడి సంస్థ 30 వేల సభ్యత్వం వుంది. ప్రధానంగా అడవిజాతులకు సంబంధించిన జనం అక్కడ హెచ్చు. ఆ స్త్రీలలోనే మహిళాసంఘం కూడ చాల వల్లపడింది. అడవిలోట్టి సాగుచేస్తున్న భూములనుండి వెళ్లగొట్టడం, అడవిలో కర్రలు కొట్టుకొంటే పన్ను విధించడం, మొదలగు జీవిత సమస్యలపై. అక్కడ మహిళా ఉద్యమం ప్రారంభమయింది. నిరక్షరాస్యతపోగొట్టడం కూడా మహిళాసంఘం కార్యక్రమాలలో ప్రధానమైన కార్యక్రమంగా తయారైంది. నిత్యజీవిత సమస్యలతో పాల్గొని సాయపడుతూ వస్తుంది కనుకనే అక్కడ నారీ సమ్మేళన్‌ను కాలప్రజాసంఘంగా అభివృద్ధి చెందింది'

మణిపూర్

"మణిపూర్ మహిళా సమ్మేళన్" పేరుతో మణిపూర్‌లో మహిళా వుద్యమం ప్రారంభమయింది. అప్పట్లో ధాన్యం దంచి ఎగుమతిచేయటం స్త్రీల కొక ప్రధాన వృత్తి. వెనుకటి కృష్ణా జిల్లా లో డెల్టాప్రదేశంనుండి బర్మాయ్యపేట రవాణాకు వంపుడు బియ్యం ఎగుమతి చేయుచోటప్పుడు (మిల్లులు లేనిరోజుల్లో) స్త్రీలకు దక్కు దంచడం ఎలా ముఖ్యవృత్తిగా ఉండేదో అప్పట్లో మణిపూర్ మహిళలస్థితి అలావుంది. అలాంటి స్థితిలో మార్వాడీలువచ్చి మణిపూర్ లో ధాన్యం మిల్లులు పెట్టారు. దానితో దంపుడువృత్తి దెబ్బతిని స్త్రీలు నిరుద్యోగులైనారు. మార్వాడీ మిల్లులకు వ్యతిరేకంగా వుద్యమం ప్రారంభమయింది. మణిపూర్‌లో బలమైన సంస్థగా మహిళా సమ్మేళన్ పెంపొందింది.

పంజాబ్

పంజాబులో మహిళా వుద్యమం "లోక్ స్త్రీసభా" పేరుతో ప్రారంభమయింది. ప్రధానంగా రైతుస్త్రీలలో యీ సంఘం వ్యాప్తిచెందింది. పన్నులకు, నీటితీరువా పెంపుదలకు వ్యతిరేకంగా లోక్ స్త్రీసభ చాల కృషి చేసింది. రైతుస్త్రీల ఆదరాభిమానాలను చూరగొన్నది. అంతేకాదు. పంజాబులో పోలీసులు చాలజాస్తి. పల్లెటూళ్ళలో ఎక్కడ వివాహం జరుగుతున్నా, సరిగ్గా వివాహంజరిగే సమయానికి వెళ్లి యేదోఒక మిషతో పెండ్లికూతురు కుటుంబంలోవారినో పెండ్లికొడుకుకు సంబంధించినవారినో అరెస్టుచేయడం, దానిని ఆసరాగా ఎంచి ఎంతో కాంత పోలీసువారికి లంచంయిచ్చి ఆ ప్రమాదం తప్పించుకోవడం, పల్లెటూరి స్త్రీలలో సర్వ సామాన్య విషయం. ఇలాంటి పోలీసు జులుముకు వ్యతిరేకంగా లోక్ స్త్రీ సభ చాల కృషిచేసింది. చాల మంది సబ్‌యిన్‌స్పెక్టర్లపై యీసందర్భంలో కేసులను నడిపింది. అలానే బాలికా వివాహాలకు వ్యతిరేకంగాను, ముసలివాండ్లకు పసిపిల్లలనిచ్చి వివాహము చేసే సందర్భాల్లో అందుకు వ్యతిరేకంగాను, చాలచోట్ల కృషి చేయడంద్వారా ఎంతోమంది స్త్రీలలో, లోక్ స్త్రీసభ బలమయిన శక్తిగా తయారైంది.

అలానే పశ్చిమ బెంగాలులో "హాస్పటల్ నర్సుల సంఘము" జబల్‌పూర్‌లో "కార్పొరేషన్ స్త్రీ కార్మికుల సంఘము" బెంగాలులో "వుమెన్ కల్చరల్ అసోసియేషన్", సౌరాష్ట్రములో "యంగ్ వెమన్స్ క్రిస్టియన్ అసోసియేషన్", అస్సాంరాష్ట్రంలో "అస్సాం మహిళాసభ", ఢిల్లీలోనూ, బెంగాలులోనూ, కాందిశీక మహిళా సంఘములు యీ కాలంలోనే స్థాపించబడినాయి.

(సశేషం)

ఆహార పరిస్థితిపై చర్చకు అఖిల పక్ష సమావేశాలు

అన్ని రాష్ట్రాలలోనూ జరపాలని రాజ్యసభలో శ్రీ భూపేష్‌గుప్త సూచన

న్యూఢిల్లీ, జూన్ 1

ఆహార పరిస్థితిని చర్చించి, సమస్యా పరిష్కారానికి మార్గాలు శోధించడానికై రాష్ట్రస్థాయిలో అఖిలపక్ష సమావేశాలు జరపాలని, కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త నేడు రాజ్యసభలో సూచించారు.

ఆహార ధాన్యాల ధరలను తగ్గించడానికి ఉపకరించే బిల్లుపై నేడురాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంలో 15 మందికిపైగా ప్రసంగించారు. శ్రీ భూపేష్‌గుప్త చర్చ ప్రారంభిస్తూ, ఆహార పరిస్థితి చాల విషమంగా వుందని, తీవ్రమైన చర్యలు అవసరమని అన్నారు. కాని ఆహారమంత్రి నిర్లక్ష్య భావంతో వున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ విధంగా వుంటే, ఇపుడు తీసుకునే అధికారాలను సక్రమంగా వినియోగిస్తారో లేదో కూడా సందేహాస్పదమే అన్నారు.

"రెండువారాలలోగా ధరలు విపరీతంగా పడిపోతాయని, ఇటీవల మంత్రి చెప్పారు. కాని జరిగిందేమిటి? ఆహార ధాన్యాలు దాచిపెట్టడం, లాభాలు గుంజటం సాగుతోంది. ప్రతివస్తువూ మునుపటికన్నా ప్రియమవుతూంది. ఆహారమంత్రి ప్రకటన హాస్యాస్పదంగా తయారయింది.'

దొంగవ్యాపారస్తులకు ప్రభుత్వమే మద్దతు చేస్తోందని చెబుతూ, శ్రీ భూపేష్‌గుప్త ఇదివరలోనే ఈ అక్రమ ప్రవర్తకులపై చర్యతీసుకోడం సాధ్యపడలేదా అని ప్రశ్నించారు. స్టాకులను ఎలా బయటికి తీయవలసిందీ మేము చూపించి వుండేవాళ్లం అని అన్నారు.

ఆహార ఉత్పత్తి ఎంతో అధికంగా వుందని ప్రభుత్వం లెక్కలు చూపుతోంది. కాని అసలీ లెక్కలు తయారుచేసేపద్ధతి సవ్యంగా లేదు. ఉదాహరణకు బియ్యం ఉత్పత్తి ఇపుడు చాలా హెచ్చుగావుందని అంటున్నాం. కాని, బియ్యంపండే ప్రాంతాలలోనే కరువురాక్షసి నీడ వ్యాపిస్తోంది. ఈ అంకెల గారడీవల్ల ప్రయోజనంలేదు అని స్పష్టంచేశారు.

ఇపుడు ప్రభుత్వం తెచ్చిన బిల్లు ప్రకారం ఇవ్వదలచిన ధర చాలా ఎక్కువ. ఇది దొంగనిల్వలుచేసినవారికి ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుంది అని శ్రీ భూపేష్‌గుప్త పేర్కొన్నారు. ఆహార పరిస్థితిని చర్చించి, సమస్యాపరిష్కారానికి మార్గాలు శోధించడానికై రాష్ట్ర స్థాయిలలో అఖిలపక్ష సమావేశాలు జరపాలని ఆయన సూచించారు.

పండిట్ కుంజ్రూ మాట్లాడుతూ, ఈచర్యలను ప్రభుత్వం లోగడఎందుకు తీసుకోలేదనిప్రశ్నించారు. దేశమంతా, ఆహార ధాన్యాల ధరల విషమైగన్లోలు పెడుతుండగా, ఆహారమంత్రి కళ్లుమూసుకుని, ఇపుడుఅభిక్షణంలో ఈ బిల్లు తెచ్చారన్నారు. ప్రధాని నుంచి క్రింది వరకు, అంతా దేశాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని, త్యాగాలు చేయాలని చెబుతుంటారు గాని, వారి బాధ్యతలను మాత్రం గుర్తించరు అని పండిట్ కుంజ్రూ విమర్శించారు.

శ్రీ ఎన్. సి. శేఖర్ (కమ్యూనిస్టు-కేరళ) మాట్లాడుతూ, కేరళలో వేలాది ఎకరాలు సాగుచేస్తున్నవారి వద్ద ధాన్యంనిల్వలు మిక్కుటంగా వున్నవని, వారి వద్దనుంచి సగటు ధరకు స్టాకులు స్వాధీనం చేసుకోవడమంటే, జారికి లాభంచేసి పెట్టడమే నని అన్నారు.

శ్రీ పైడా వెంకటనారాయణ (ప్ర. సో-ఆంధ్ర), ఆహారధాన్యాల రవాణాను అదుపులోకి తెస్తేతప్ప, ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు.

శ్రీ పి. జె. థామస్ (స్వ-కేరళ), భారత ప్రజలకు రెండణాలకు భోజనం పెట్టడానికి వీలుగా, గ్రామాలలో, చిన్న పట్టణాలలో ఆహారశాలలు స్థాపించాలన్నారు.

చర్చకు మంత్రి శ్రీ జైన్ సమాధానం చెప్పిన తర్వాత బిల్లును సభవారు ఆమోదించారు.

కన్సారీ హల్దార్‌ని అరెస్టు చేయాలని విఫలయత్నం

న్యూఢిల్లీ, జూన్ 1

బెంగాల్‌నుంచి ఎన్నికైన కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు శ్రీ కన్సారీహల్దార్‌ని అరెస్టు చేయాలని నిన్న ఇక్కడ పోలీసులు ప్రయత్నించి విఫలులైనారు.

లోక్‌సభ సమావేశం సాయంత్రం ఆరుగంటలకు జాయిదాపడే సమయానికి, కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ కార్యాలయంవద్ద సాయుధ పోలీసులు జీప్‌తో వచ్చి కాపలా వేశారు. కాని అప్పటికేహల్దార్ ఢిల్లీ నుంచి వెళ్ళిపోయినట్లు తెలిసింది.

హల్దార్‌పై తొమ్మిదేండ్లుగా పోలీసువారంటు వుంది. ఈ విషయాన్ని ప్రధాని నెహ్రూ పరిశీలిస్తున్నట్లుకూడా తెలుస్తుంది. ఇటీవలనే కొద్దిరోజులక్రితం, కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త, ప్రధాని ఒక టీపార్టీ చేసిన సందర్భంలో అక్కడకు వచ్చిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డాక్టరు బి. సి. రాయ్‌కి హల్దార్‌ని పరిచయం చేశారు. (వి.వి.)

అణ్వస్త్రపరీక్షలు

ఆపివేయాలని బ్రిటన్‌కు కలకత్తా క

లేఖలు

పోదిలిలో విత్తనం వడ్ల మోసం

మహాశయా!

పొదిలి పెసవులో రెండవ శాఖకు సరిపడా నీరున్నా, వ్యవసాయశాఖవారి వద్ద విత్తనాలు, వడ్లు దొరకలేదు. ఇది కనిపెట్టి స్థానిక పెద్దలు పెద్దబ్బి, ఆచెన్ సుబ్బారావు, ముల్లా గౌస్ గార్లు కంధం తాలూకా పల్లెలకుపోయి బస్తా 18 19-8-0 చొప్పున దాదాపు 200 బస్తాలు అన్నిరకములు కలిసిన వడ్లుకొని తెచ్చి "ఇవి మేలుజాతి వడ్లు శాలిగుమాసుముల పంట"యని అమాయకులైన రైతుల కండ్లలో దుమ్ముకొట్టి నమ్మించి బస్తా 18 రూ. 36/- చొప్పున అమ్మి దాదాపు రు. 3000/-లు సంపాదించుకున్నారు. 19 రూపాయల ఖరీదగు వడ్లకు 36 రూపాయలు చెల్లించుటేగాక రైతు 18 రూ 150 లు ఖర్చుచేసి సాటుకొని తీరా మార్చేపరికి పొలములోని పంట సంబంధములేదు. అసలే కరువై అన్నమో యని అల్లాడే రోజుల్లో ఈ పెద్దమనుష్యుల దగాబలన దాదాపు నాలుగువందల పుట్ల ధాన్యము వృధా యైనది.

కాబట్టి ప్రభుత్వము ఇప్పటికైనా ప్రజలకు కలిగే ఇలాంటి నష్టాల్ని గుర్తించి ప్రస్తుతానికి శిస్తు రెమిషన్ ఇవ్వాలి. భవిష్యత్తులో పేదరైతులు 'పెద్దమనుష్యుల' చేతులలోపడి ఇలాంటి నష్టాలు పడకుండ ప్రభుత్వం సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలి.

ఇట్లు,
పి. వి. నరసింహం,
పొదిలి.

అధికార దుర్వినియోగం

మహాశయా!

చింతలపూడి తాలూకా ధర్మాజీగూడెం సబ్సిస్టెంటుగారు వారి చుట్టాలను ఉచితంగా బస్‌లపై తీసుకురాకేదని బస్ డ్రైవర్లపై, కండక్టర్లపై కక్ష బూనుతున్నారు. వీరు ఇక్కడకు వచ్చి రెండు సంవత్సరాలైనది. అప్పటినుండి బస్ పనివారిని బానిసలుగా చూస్తూ, తమ ఉద్యోగాధికారాన్ని స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ప్రభుత్వాధికారులు వీరి చర్యలను అరికట్టాలని కోరుతున్నాను.

ఇట్లు,
కంచన కాళీ విశ్వనాథరావు,
చింతలపూడి.

వమ్మవరం వ్యవసాయకూలీ సమ్మె

యలమంచిలి మే 30

విశాఖజిల్లా ఎలమంచిలితాలూకా వమ్మవరం గ్రామ వ్యవసాయ కూలీలు మొగవారికి 1-4-0, ఆడవారికి 0-12-0 కూలీరేటు యివ్వాలని కోరగా స్థానిక భూస్వాములు యివ్వనిరాకరించారు. అందుపై కూలీలందరు సమ్మెచేశారు. భూస్వాముల పోటీ కూలీలను తెచ్చి పనిచేయించడానికి ప్రయత్నిస్తున్నారు.

తణుకు

నెలపురోజున పనివారిచే పని చేయించినందుకుగాను అంగళ్ళచట్టం క్రింద తణుకు జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజస్ట్రేటు స్థానిక శ్రీరామ సైకిల్ షాప్ యజమాని శ్రీ కడిమిళ్ల వెంకట్రామన్నకు రు 25 వ తేదీన రు 5/-లు జరిమానా విధించారు.

పాకిస్తాన్‌లో మత్స్య పరిశ్రమాభివృద్ధి కొరకు అమెరికా 10 లక్షల డాలర్లు గ్రాంటు ఇవ్వడానికి అంగీకరించిందట.

ఆంధ్రలో సిగరెట్ ఫ్యాక్టరీ

ఐ. ఎల్. టి. డి. కంపెనీవారు నెలకొల్పాలని గొల్లపూడి పొగాకు కార్మిక సభలో సూచన

విజయవాడ, మే 30

ఆంధ్రప్రదేశ్ ఐ. ఎల్. టి. డి. కార్మిక సంఘం, గొల్లపూడి బ్రాంచి వార్షిక సమావేశం శ్రీ దారం ప్రకాశంగారి అధ్యక్షతను 25 వ తేదీన జరిగింది. ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్యదర్శి, ఆంధ్రస్టేటు ఐ. ఎల్. టి. డి. కార్మిక సంఘ కార్యదర్శియైన శ్రీ కె. ఎల్. నరసింహం, యం. పి., విజయవాడ పట్టణ కార్మికసంఘం కార్యదర్శి శ్రీ బూరాడ శేషారామయ్య, ఆంధ్రస్టేటు ఐ. యల్. టి. డి. కార్మిక సంఘ ప్రాంతీయ కార్యదర్శి శ్రీ జి. బాలాజీ మొదలగాగు వక్తలు వ్యవహరించారు.

శ్రీ కె. యల్. నరసింహంగారు ప్రదేశ్ యూనియన్ నిర్మాణానంతరం ఐ. యల్. టి. డి. అధికారులు కార్మికుల బిక్కతను, వారి శక్తిని గుర్తించక తప్పలేదన్నారు. అందువలననే సంఘాన్ని గుర్తించారనీ, జీతాలను పెంచి బోనసు పద్ధతి మార్చి బదిలీలు పెట్టుకొని త్రోతగుంటలో తొలగించిన 9 మంది కార్మికులను మరల పనిలోకి తీసుకొని కార్మికుల కోర్కెలను అంగీకరించారని అన్నారు. అధిక పన్నుల మూలాన, పెరిగిపోతున్న ధరల మూలాన కార్మికుల జీవితస్థాయి పడిపోతున్నదనీ, పీటికి వ్యతిరేకంగాను, అధిక జీతాల కోసము పోరాటం సాగించాలనీ అన్నారు. బదిలీలు పెట్టుకొనే సందర్భములో, యింకా కొన్ని సమస్యల మీద వచ్చిన అభిప్రాయ భేదాలను విస్మరించి, యూనియన్ ఐక్యతను కాపాడాలని హెచ్చరించారు.

శ్రీ బూరాడ శేషారామయ్యగారు వుపన్యసించుతూ పట్టణ ట్రేడ్ యూనియన్‌తో సహకరించి పని చేయాలని, రైల్వేకార్మికుల సహకారం పుగాకు కార్మికులకెప్పుడూ వుంటూనే వుంటుందని అన్నారు.

శ్రీ బాలాజీదాస్‌గారు వుపన్యసించుతూ కార్మికుల ఐక్యత గణనీయమైన విజయాలను సాధించగలదని చెపుతూ, అందుకు తార్కాణంగా రాష్ట్రసంఘం సాధించిన విజయాలను పేర్కొన్నారు. బ్రిటిష్ పెట్టుబడిదారులు భారతదేశంనుండి కొన్నిసార్లు రూపాయల లాభాల్ని తరలించుకు పోతున్నారని, యీ ప్రవాహాన్ని అరికట్టి జీవితపరిశ్రమల అభివృద్ధి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐ.యల్. టి. డి. కంపెనీవారు ఒక సిగరెట్టు ఫ్యాక్టరీని నిర్మించాలని కోరారు. రాజమండ్రిలో పోటీ కార్మికసంఘాన్ని బలపరుస్తున్న అధికారుల చర్యలను నిరసించారు.

అధ్యక్షులు ప్రకాశంగారు పత్తేవపల్లి, రాజమండ్రి, తాడిపర్తి నుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులను సభికులకు పరిచయం చేసారు.

తర్వాత కార్యదర్శి నివేదిక, జమా ఖర్చులు ఆమోదించబడినవి.

శ్రీ మంతెనవారి ప్రకాశంగారి మరణానికి సంతాపాన్ని తెలుపుతూ, కొన్ సీజనల్ పనులలోకి తీసుకోబడ్డవారు సీనియారిటీని పాటించాలని కోరుతూ కార్మికుల నుండి దరఖాస్తులు ఆహ్వానించి వాచ్‌మన్‌లకు డ్యూటీ ఎలకేన్సు యివ్వాలని కోరుతూ తీర్మానించారు.

పిదప "పల్నాటి వీరుల చరిత్ర" బుర్రకథ చెప్పబడింది.

విశాఖ రేవులో సమ్మె

విశాఖ, మే 30

విశాఖ ఓడరేవులో ఎగుమతి దిగుమతులు చేసే కంట్రాక్టు కళాసీల గత వారం రోజులనుండీ సమ్మె చేస్తున్నారు. వారి సంఘ నాయకులు ఆదివారమునుండి యీ పని జేస్తున్న 9 గ్యాంగులవారికి యీ సారి అవకాశం యివ్వకుండా కొత్తగా విడు గ్యాంగులకు అవకాశం యివ్వబడలేనని నిర్ణయించారు. దానితో కొలువు కోల్పోయే 9 గ్యాంగులలోని సుమారు 400 మంది కళాసీలు సమ్మె ప్రారంభించారు. కొత్త గ్యాంగులు విడు ఛార్జీతీసుకోలేదు గనుక వారి ద్వారా కూడా పని జరగడంలేదు. దీనితో ఓడలనుండి దిగుమతి కావాల్సిన ఆహార పదార్థాలు ఓడలలోనే వుండిపోయి, పోర్టు అధికారులు డెమరేజీ చెల్లించుకోవలసివస్తోన్నట్లు తెలుస్తోంది ఈ పోర్టు కళాసీ సంఘ అధ్యక్షుడు శ్రీ బి. జి. ఎం. ఎ. నరసింగరావు యం. ఎల్. ఎ. గారు ప్రస్తుతం విదేశ సంచారంలో వున్నారు. గ్యాంగు పనివారు సంఘ జనరల్ బాడీ సమావేశాన్ని జరిపి జమా ఖర్చులను పరిశీలించవలసినదని పట్టు బట్టారనీ అదిజరుగుతే తాను యిరాకటంలో పదాల్సివస్తుందని అధ్యక్షుడు కక్ష వహించి యీ విధంగా జేశారనీ లోపొయుకారీ వర్గాలనుండి తెలుస్తూంది.

ఈ వివాద పరిష్కారం నిమిత్తం కేంద్రప్రాంతీయ లేబర్ కమిషనర్ శ్రీ హరిసింగ్‌గారు మద్రాసునుండి మొయిలలో నిన్న నిక్కడకు చేరుకొన్నారు.

లింగగిరి పరగణా రైతులనుతొలగించవాదు

నల్లగొండ కలెక్టరు 'స్టే' ఉత్తర్వు

హుజూరునగర్, మే 28

హుజూరునగరుతాలూకా లింగగిరి పరగణాలో దాదాపు 200 పేద రైతులను భూములనుంచి తొలగించి మాజీ జమీందార్లు మంత్రి ప్రగడ వెంకటప్పారావు, వారి అన్న పట్టపల్లి నరసింహారావుగారలకు స్వాధీనం చేయుటకు హుజూరునగరు తహశీలుదారునుంచి ఒక నెలరోజుల సమయమిస్తూ నోటీసులు పంపబడ్డవి.

తహశీలుదారు ఉత్తర్వుకు వ్యతిరేకంగా గానుగుబండ, అమరకరం గ్రామాల రైతులు నల్లగొండజిల్లా కలెక్టరుగారిముద్దు నిన్న టి రోజు అప్పీలు దాఖల్ చేసుకున్నారు. అప్పీలుతోపాటు తహశీలుదారు ఉత్తర్వు అమలుజరుగకుండా "స్టే" ఆర్డరు కోరారు. కలెక్టరుగారు రైతుల అప్పీలును అంగీకరిస్తూ రైతులకు అనుకూలంగా "స్టే" ఆర్డరు కూడా ఇచ్చారు. రైతుల పక్షంగా శ్రీ కంచెనేపల్లి చిన వెంకట్రామారావు గారులాయరుగా పనిచేశారు.

హుజూర్‌నగర్ శాసనసభ్యుడు శ్రీ దొడ్డా నర్సయ్యగారు రైతుల న్యాయమైన కోర్కెలను బలపరిచి వారికి సహాయపడ్డారు.

గుంటూరు రైస్ మిల్లుల తగాదా

హైద్రాబాద్ పారిశ్రామిక ట్రిబ్యునల్‌కు నివేదన

హైద్రాబాద్, జూన్ 1

గుంటూరు రైసుమిల్లుల యజమానులకు, కార్మికులకు మధ్య ఏర్పడిన తగాదా హైద్రాబాద్‌లో పారిశ్రామిక ట్రిబ్యునల్ పరిశీలనకు పంపబడింది.

విశాఖపట్టణం ల్యూమస్ కంపెనీ యజమానులకు, కార్మికులకూ మధ్య ఏర్పడిన తగాదా కూడ అదే ట్రిబ్యునల్‌కు పంపబడింది.

సత్తెనపల్లి

చౌకడిపోలు సెలకోల్పాలని పెద్దమంది సంతకాలతో ఒక మహజరును జనసంమం తరఫున శ్రీ జేవి శెట్టి నాగేశ్వరరావుగారు తహశీల్దారుకు సమర్పించారు. ఈనెల 26 వ తేదీన ఇదే సమస్యపై బహిరంగసభ కూడా జరిగింది.

మహిళామహాసభకు విరాళాల సేకరణ

పలు ప్రాంతాలలో మహిళా కార్యకర్తల పర్యటన

ఏలూరు, మే 30

విజయవాడలో 6-9 తేదీలలో జరుగనున్న అఖిలభారత మహిళా మహాసభ ప్రచారం, విరాళాల సేకరణనిమిత్తం పశ్చిమ గోదావరి జిల్లా మహిళాసంఘ కార్యదర్శిని శ్రీమతి అన్నే అనసూయ, శ్రీమతి గారపాటి విమలాదేవిగార్లు కొవ్వూరు తణుకు తాలూకాలో ఈనెల 18 వ తేదీనుండి 27 వ తేదీవరకు పర్యటించారు. కొవ్వూరు తాలూకా చిన్నాయగూడెంలో రు. 58-0-0 పల్లంట్ల రు. 38-0-0, యర్నగూడెం రు. 12-0-0, తణుకు తాలూకా పెనుగొండలో రు. 31-0-0 పెనుమంట్రలో రు. 56 వేలివెన్నులో రు. 108 వసూలు చేశారు. మొత్తం 86 మంది మహిళా సంఘసభ్యురాండ్రను చేర్పించారు.

కాజ ఫిర్కాలో

మహిళా మహాసభకు దివిలితాలూకా కాజ ఫిర్కాలో తాలూకా మహిళా సంఘం నాయకురాండ్రు శ్రీమతులు మండవ మల్లికాంబ, జాదెళ్ళ కనకం తలగాన్లు భట్లపెనుమర్రులో రు. 100 పెదపూడిలో రు. 41 అ, మొక్వలో రు. 26 అ, పెదపగడాలలో రు. 17 వసూలు చేశారు. మహిళామహాసభకు ఎక్కువ మంది స్త్రీలు రావలసిందని ప్రచారం చేశారు.

తెనాలిలో

తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలు శ్రీమతి తోట అనసూయమ్మగారు ఈనెల 30 వ తేదీనాటికి రు 20 వసూలు చేశారు. గంగానమ్మపేటలో 30 మంది మహిళా సంఘ సభ్యురాండ్రను చేర్చారు.

మహిళా మహాసభకు గుంటూరులో విరాళాలు

విజయవాడ, మే 30

మహిళా మహాసభకు గుంటూరు పట్టణంలో ఇంతవరకు రు 116-0-0లు విరాళాల వసూలు చేశారు. మహాసభ గురించి మహిళా కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. విరాళాలు ఉత్సాహంగా వసూలు చేస్తున్నారు.

నంబూరులో

నంబూరు గ్రామ మహిళాసంఘం తరఫున ఇంతవరకు రు 30-0-0 విరాళం వసూలుచేశారు. ఇంకా రు 10/- వాగ్దానాలున్నాయి.

మహారాష్ట్ర సమితి శాసన సభ్యుల సదస్సు

బొంబాయిలో జూన్ 16 న

న్యూఢిల్లీ, జూన్ 1

సంయుక్త మహారాష్ట్ర సమితి టిక్కెట్టుపై బొంబాయి శాసనసభకు ఎన్నికైన సభ్యుల సదస్సు జూన్ 16న బొంబాయిలో జరుగుతుందని సమితి అధ్యక్షుడు శ్రీ ఎస్. ఎ. డాంగే నేడిక్కడ ప్రకటించారు.

మహాగుజరాత్ జనతా పరిషత్ నాయకులతో సమితి ప్రతినిధులు త్వరలోనే సంప్రతింపులు జరుపుతారని శ్రీడాంగే వివరించారు.

ఇండియా, పాకిస్తాన్, సీలోన్ కాల్ నుంచి పత్తి, బట్టల దిగుమతి సమస్యను బ్రిటిష్ కామన్సు సభలో లేబర్ పార్టీ లేవనెత్తబోతున్నది.

సభలు సమావేశాలు

వివిధ జిల్లా కమ్యూనిస్టు కమిటీల విస్తృతసమావేశాలు

హైద్రాబాద్, జూన్ 1

వివిధ జిల్లా కమ్యూనిస్టుకమిటీల విస్తృత సమావేశాలు జూన్ నెలలో ఈ దిగువ తేదీలందు జరుగుతాయి. ఆయా సమావేశాలందు రాష్ట్రసెక్రటేరియట్ తరఫున ఈక్రిందివారు పాల్గొంటారు.

నల్లగొండ (5 నుండి 9 వరకు) - రావి నారాయణరెడ్డి, కేవులపల్లి వెంకటేశ్వరరావుగార్లు. వరంగలు (9, 10, 11) పుచ్చలపల్లి సుందరయ్య, తూ. గోదావరి (10 నుండి 15 వరకు) చంద్రరాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్యగార్లు, గుంటూరు (3, 4) మోటూరుహనుమంతరావు, కృష్ణా (17) చంద్రరాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్యగార్లు, ప. గోదావరి (8, 9, 10) వై. వి. కృష్ణారావు, మోటూరి హనుమంతరావు, నెల్లూరు (5, 6, 7) పుచ్చలపల్లి సుందరయ్య, విశాఖ (13-20 మధ్య) వై. వి. కృష్ణారావు, నిజామాబాదు (4, 5, 6) తమ్మారెడ్డి సత్యనారాయణ, హైద్రాబాదు (10) కమ్మారెడ్డి సత్యనారాయణ, హైద్రాబాదు నగరం (8) మక్దూం మొహియుద్దీన్, మహబూబ్ నగర్ (11, 12) కేవులపల్లి వెంకటేశ్వరరావు ఆదిలాబాదు: బద్దం ఎల్లారెడ్డి.

అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరుజిల్లాల సమావేశాల తేదీలు తరువాత ప్రకటించబడ్తాయి. ఖమ్మం కరీంనగరు, మెదకుజిల్లాల సమావేశాలు జరుగుతూవున్నవి.

నెల్లూరుజిల్లా గూడూరు డివిజన్ కమ్యూనిస్టుకమిటీ సమావేశం జూన్ నెల 4 తేది మంగళవారం వుదయం 9 గంటలకు గూడూరుపార్టీ ఆఫీసులో జరుగుతుంది.

నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు కమిటి విస్తృత సమావేశం నెల్లూరులో 5, 6, 7 తేదీలలో జరుగుతుంది. 5 తేది ఉదయం 8 గంటలకే సమావేశం ప్రారంభ మౌతుంది. కాబట్టి జిల్లాకమిటీ సభ్యులు, ఆహ్వానితులు 4 తేది రాత్రికే నెల్లూరు రావాలనీ, సమావేశానికి శ్రీ పి. సుందరయ్యగారు హాజరౌతారని, శ్రీ బి. శంకరయ్యగారు తెలియజేస్తున్నారు.

అణ్వస్త్ర పాటవ పరీక్షలు

నిషేధించాలని తిరువాన్కూర్ యువజనోత్సవంలో తీర్మానం

క్విలన్, మే 31

అణ్వస్త్ర పాటవ పరీక్షలను నిషేధించాలని తిరువాన్కూర్ యువజనోత్సవంలో తీర్మానించారు. ఈ వుత్సవం పదిరోజులు జరిగింది.

మాస్కోలో జరుగనున్న ప్రపంచ యువజనోత్సవాలలో పాల్గొనడానికై ఎక్కువమంది భారతీయ ప్రతినిధులకు అవకాశం ఇవ్వాలని భారత ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.

అఖిల కేరళ యువజన సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఈ వుత్సవంలో నిర్ణయించారు. అందుకు పార్లమెంటు సభ్యుడు శ్రీ పి. వాసుదేవన్ నాయర్ నాయకత్వాన పంథొమ్మిది మందితో ఒక కమిటీని ఎన్నుకొన్నారు.

ఒక్కొక్క పరీక్షకు 50 వేల మంది బలి

అణ్వాస్త్రాలనుగురించి డాక్టర్ చిషోమ్ హెచ్చరిక

న్యూజిలాండ్ మినిస్టర్, జూన్ 1

ఇప్పుడు జరుగుతున్న అణు, హైడ్రోజన్ బాంబు పరీక్షలలో ప్రతి ఒక్కదానివలితంగానూ ప్రపంచంలో 50 వేలమంది చొప్పున చనిపోతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బ్రాక్ చిషోమ్ బ్రిటిష్ కొలంబియాలోని న్యూజిలాండ్ మినిస్టర్‌లో ఈవేళ హెచ్చరించారు.

ఈ బాంబు పరీక్ష ప్రభావం వెనువెంటనే కనబడదన్నారు. అది 'లుకీమియా' అనే వ్యాధికి దారితీసి, మెల్లమెల్లగా చనిపోతారని వివరించారు.

పశ్చిమ జర్మనీ ప్రభుత్వం ఇటీవల సోవియట్‌కి అందించిన మెమొరాండాన్ని బలపరుస్తూ బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటన చేసింది.

♦ ♦ ♦

ఇండోనేషియాలో దక్షిణ సెలెబస్ దీవులకు కూడా ఇన్ఫ్లుయంజా వ్యాపించింది. రెండు వేల మందికి వ్యాధి సోకగా, ఆర్గురు మరణించారు.

7 గంటలకు
నేటి ఉదయం
టి సేవించి
నిత్యోత్సాహంతో
పని ప్రారంభించండి



నేను టీని-
మీ మనస్సు
బాగా వున్నపుడు,
లేనప్పుడు కూడా
నేను మీకు
చిర మిత్రుడను

TEA BOARD INDIA
EST 1880

ప్రభుత్వ యాజమాన్యాన ఉన్న కార్మికుల దుస్థితి

నాలుగేళ్లయినా కనీస సౌకర్యాలు లేని గవర్నమెంటు ప్రెస్ పనివారి గోడు

కర్నూలు, మే 31

ఆంధ్ర ప్రభుత్వ ప్రెస్‌లో ఉన్న 350 మంది పనివారికి సరియైనవిధంగా యింక్రిమెంట్లు, బకాయిలు, సిక్ లీవులు, సీనియారిటీ మొదలైనవన్నీ అమలుజరపడం లేదనీ ప్రెస్ సూపరింటెండెంటు ఈవిషయంలో ఎట్టి శ్రద్ధచూపడం లేదనీ అందువేత యిప్పుడైనా ప్రభుత్వం పనివారికి కనీససౌకర్యాలు అమలు జరిగేటట్లు చూడాలనీ ఈనెల 26 వ తేదీన టౌనుహాలులో జరిగిన ఆంధ్ర ప్రభుత్వ ప్రెస్ కార్మికసంఘ సాధారణ సమావేశంలో కోరారు.

జనాబ్ నజీర్ అహమ్మద్ బి. ఎ. బి. ఎల్. గారు సభకు అధ్యక్షత వహించారు.

సభా ప్రారంభంలో ప్రకాశం పంతులుగారి మృతికి సంతాపం వెల్లడించారు.

ప్రెస్ ప్రారంభమై నాల్గుసంవత్సరాలైనప్పటికీ యింతవరకు క్యాంటీను రెస్టుహౌస్, సహకారసంఘం మొదలైన సౌకర్యాలు లేవనీ వెంటనే వీటిని ఏర్పాటు చేయాలనీ కోరారు.

మద్దాల్లు, ప్యాకర్లు, నౌకర్లు, వాచ్‌మెన్, మెసెంజర్లు స్వీపర్లు మొదలగువారిని భాయంచేసి చట్టరీత్యా యివ్వవలసిన సౌకర్యాలన్నీ యివ్వాలని కోరారు.

పైకోర్కెలతో ప్రభుత్వానికి మెమొరాండం పంపడానికి నిర్ణయించారు.

నూతన సంవత్సరానికి ఉపాధ్యక్షులుగా శ్రీ జనాబ్ నజీర్ అహమ్మద్ బి. ఎ. బి. ఎల్, శ్రీ ఎస్. హనుమంతారెడ్డిగార్లను కార్యదర్శిగా శ్రీ తాటికొండ పుల్లయ్యగారిని, సహాయకార్యదర్శులుగా శ్రీ ఎ. ఎల్. నరసింహారావు, టి. బాలయ్యగార్లను కోశాధికారిగా శ్రీ యం. డి. అల్బర్ గారిని ఎన్నుకొన్నారు.

కార్యవర్గ సభ్యులుగా దిగువ 25 మందిని ఎన్నుకొన్నారు.

శ్రీయుతులు యి. నరసింహులు, యం. వెంకటస్వామి, పి. వెంకటేశ్వరరావు, యస్. జి. రసూల్, బి. రామస్వామి, జి. సి. వెంకటయ్య, కె. కోటేశ్వరరావు, యం. జె. దాస్, వై. నాగిరెడ్డి, బి. వి. కుప్పుస్వామి, మహబూబ్ ఖాన్, సి. హెచ్. రంగారావు, ఎ. మహబూబ్, కె. సుబ్బయ్య రాజు, యం. డి. వుస్మాన్, కె. వి. యస్. మురళీకృష్ణారావు, కె. సుబ్బారావు, డి. చిన్నారావు, యం. సన్నముల్లా, జి. స్యామేల్, బి. ప్రకాశం, యస్. ఎ వదూద్, టి. మాసన్న, యం. రామయ్య, యం. క్రిష్ణయ్య.



బర్మా-షెల్ మరియు పసిడి ఆకు

ప్రపంచంలో మిక్కిలి గొప్ప పొగాకు పంట దేశములందు భారతదేశం మూడవది అను విషయం విపులంగా తెలియని యదార్థం. దేశమందలి మొత్తం పంటలో సగం పంటకు ఎన్నికైనది ఆంధ్రప్రదేశం, మీకు లెక్క వివరం తెలుసుకొను ఇచ్ఛవుంటే, సాలీనా 3 లక్షల 30 వేల ఎకరాల భూమి యందు 1 లక్ష పదివేల టన్నుల పొగాకు పండుచున్నది. ఈ పంట విలువ 20 కోట్ల రూపాయలకు మించియున్నది—పొగాకు ఇచ్చట పసిడి ఆకు అనబడుతుంది, ఆశ్చర్యంకాదు!

పొగాకు పరిశ్రమకు మేము అనేకవిధముల తోడ్పడుచున్నాము. అనపర్తియందున్ను, పీరాలయందున్ను, ఈ రెండు ముఖ్యమైన పొగాకు పంటస్థానములకూ సేవచేయు నిమిత్తం బర్మా-షెల్ పెట్రోల్ మరియు హైస్పీడ్ డీసెల్ ఆయిల్ బౌట్‌లెట్‌లు స్థాపించబడినవి. మేము తిరిగి ఆరబెట్టునట్టి యంత్రములకు లైట్ డీసెల్ ఆయిలున్ను పొగాకు నిలువచేయబడు గోదాన్లలో వెట్ట కొరకు పొగబారించుటకు మినరల్ టర్పెంటైనున్ను సమకూర్చుచున్నాము కూడ, ఇంకేగాక మా ఆల్‌డ్రెక్స్, ఎన్‌డ్రెక్స్, డీల్‌డ్రెక్స్ పొగాకునారును, మొక్కలను రక్షించుటలో ముఖ్యపాత్రను నిర్వహించుచున్నవి.

భారత దేశమందలి 22 బర్మా-షెల్ డివిషనల్ ఆఫీసులలో, రెండు, క్రొత్త రాష్ట్రమైనటువంటి ఆంధ్రప్రదేశమునందు నెలకొల్పబడియున్నవి- ఒకటి సికింద్రాబాదు యందున్ను మరొకటి విశాఖపట్నము యందున్ను. ఆంధ్రప్రదేశ మందలి ప్రజలకు ముఖ్యమైన పెట్రోలియమ్ ఉత్పత్తులను ఎడతెగకుండా సమకూర్చుచుండుటలో మా ఏజెంట్లకున్ను వ్యాపారులకున్ను ఈ ఆఫీసులు తోడ్పడుచున్నవి.



బర్మా - షెల్ . . .
భారతదేశ జీవితమందు భాగమైయున్నది

Paths of Science.

By L. Fridland.

CONTENTS:

* Ampoule of life
* Death deceived
* Fight for time
* Wonders of Surgery
* The heart beseiged
* To tame time
* Life stimulants
* When the brain sleeps
* The vital link

A serious book on Medicine, written in a be-witching novel style.

Pages: 296 (Postage Extra) Rs. 2-8-0

Available With:
Visalaandhra Publishing House, Vijayawada-2.
People's Book House, Hyderabad.

అణ్వాయుధ పాటవ పరీక్షలు మానవజాతి పట్ల మహాపచారం

అమెరికా టెలివిజన్ ఇంటర్వ్యూలో భారతరక్షణమంత్రి కృష్ణమీనన్ ఉద్ఘాటన

న్యూయార్కు, మే 31

అణ్వాయుధ పాటవపరీక్షలు మానవజాతిపట్ల నే మహాపరాధమని భారత రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ ఇక్కడ ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో ఉద్ఘాటించారు. ఈ పరీక్షలు శాంతికి ఏ విధంగానూ దోహదకరం చేయజాలవన్నారు. అణుశక్తిని విధ్వంసకార్యానికి భారతదేశం ఏనాడూ వాడబోదన్నారు.

ఇతరులనుంచి కనీసం రక్షణకోసమైనా భారతదేశం ఆటంబాంబులను తయారు చేసుకొనదా అని ప్రశ్నించగా ఆటంబాంబులు ఎవరినీ రక్షించజాలవని ఆయన జవాబుచెప్పారు.

మీరు అమెరికా నుంచి ఆయుధాల సరఫరాను ఆశిస్తున్నారా అన్న ప్రశ్నకు ఆయన ఇలా జవాబు చెప్పారు

"భారతదేశం ఆయుధాల పోటీలో పాల్గొనడంలేదు. మాదేశానికి మంచి పైపుణ్యంగల సేనవుంది. ఈసేన ఆయుధాలలో అత్యధిక భాగం బ్రిటిష్ ఆయుధాలు. అమెరికా మా పొరుగునున్న దేశానికి ఆయుధాలు సరఫరా చేస్తోంది. మేం కూడా అక్కడి నుంచే ఆయుధాలు కొనడానికి మా ప్రజాసీకం అంగీకరించదు."

ఈఇంటర్వ్యూకుముందు టెలివిజన్ సర్వీసుయజమాని మెక్రియరీ శ్రీ కృష్ణమీనన్‌ని టెలివిజన్ ద్రష్టలకు పరిచయంచేస్తూ ఈయన భారతదేశ ప్రధాన వ్యక్తుల్లో రెండవవారు అని పేర్కొన్నారు. ఈయనను ఆసియాలోని విడుగురు మహాపురుషుల్లోనూ ఒకరుగా పేర్కొనవచ్చునని కూడా అన్నారు.

శ్రీ కృష్ణమీనన్‌ని మెక్రియరీఏతి, మెక్రియరీ కుమారుడు, మిస్ కేసీ ప్రశ్నించారు. కేసీ మాజీజపాను రాయబారి కుమార్తె.

అణ్వాయుధ పాటవ పరీక్షల విషయమై భారతదేశ విధానం ఏమిటని శ్రీ మీనన్‌ని మిస్ కేసీ ప్రశ్నించింది.

అణ్వాయుధ పాటవ పరీక్షలకు భారతదేశం వ్యతిరేకం అన్న విషయంలో ఎవరికి అనుమానంలేదని ఆయన జవాబు చెప్పారు. 1954 లో భారత పార్లమెంటు ఈ పరీక్షలను ఆపాలని విజ్ఞప్తి చేసిందన్నారు.

ఇలాంటి పాటవ పరీక్షలను ఆపకపోతే ఇతర రాజ్యాలకు విజ్ఞప్తిచేస్తూ భారత ప్రభుత్వంతరఫున మీరు వారాలకిందటే తాను పార్లమెంటులో తీర్మానాన్ని ప్రతిపాదించిన విషయాన్ని ప్రస్తావించారు.

ఈ పాటవ పరీక్షలవల్ల మానవజాతికి అపార ఉపద్రవం ముంచుకొస్తుందన్న విషయాన్ని ప్రపంచమంతా తెలుసుకొనవలసిన తరుణం వచ్చిందన్నారు. ఈ పాటవపరీక్షలు మానవజాతిపట్లనే మహాపచారం అని భారతీయుల నమ్మకమన్నారు. ఈ పరీక్షలను జరపడం శుద్ధ అవివేకమనీ ఇది మానవజాతికి ఏ విధంగానూ తోడ్పడదనీ ఆయన చెప్పారు.

మైకేల్ మెక్రియరీ భారతదేశంలో గొప్ప అణుశాస్త్రవేత్తలున్నారుకదా, వారు ఆటంబాంబులను గురించి పరిశోధనలు చేస్తున్నారా?

శ్రీ మీనన్ అణుశక్తిని పరిశోధించే శాస్త్రజ్ఞులు ఎనిమిది వందల మంది మా దేశంలో వున్నారు. కాని మేం అణుశక్తిని విధ్వంసనకార్యాలకు వినియోగించబోము. ఆటంబాంబులు ప్రపంచాన్ని హడలుకొడతాయే కాని ఎవరినీ రక్షించబోవు.

ప్రశ్న. చైనాకు కొన్ని సరుకులను ఎగుమతి చేయరాదన్న వర్తకాంక్షను బ్రిటన్ రద్దు చేసింది. దీనివల్ల అమెరికాకు ఆసియాలో పలుకుబడి పోతుందా?

జవాబు: ఈ వార్త నాకు చాలా సంతోషం కలిగించింది స్వేచ్ఛా వ్యాపారంవల్ల రాజకీయాల్లో స్వేచ్ఛ ఏర్పడుతుంది. దేశాలమధ్య సత్సంబంధాలు నెలకొల్పుకొనడానికి మార్గం ఇదే. ఇది ఉభయదేశాలకు శ్రేయస్కరం. తనకు కావలసిన సరుకులు చైనాకు లభిస్తాయి. బ్రిటనుకు తన సరుకులు అమ్ముడుపోతాయి. ఇక మా దేశ విధానం (అమెరికా విధానం) మీద నేను వ్యాఖ్య చేయదలచుకొనలేదు. కాగా అమెరికాకు సమస్యపైన భద్రతా సమితిలో ఏడు గంటలు నలభై ఎనిమిది నిమిషాల సేపు ప్రసంగించారు కదా! ఆ ప్రసంగాన్ని మీరు నోట్సు ఆధారంగానే వ్రాయగలిగారా? లేక మీ ప్రసంగాన్ని రాసిపెట్టే రహస్య రచయిత లెవరైనా వున్నారా?

శ్రీ మీనన్ ఆ ప్రసంగాన్ని గురించి అంతా విస్తారంగానే చెప్పుకొంటున్నారు. కాని నేను వాస్తవ విషయాలను మాట్లాడడానికే ఆ ప్రసంగం చేశానుగాని విస్తారాన్ని పుట్టించడంకోసం కాదు. వాస్తవాలను చెప్పాలంటే వాటిని ప్రజలంతా అర్థం చేసుకొనడం కోసం తగు పునాదులు వేయాలి. నా అభిప్రాయాలను మీకు నచ్చచెప్పడమే కదా మాట్లాడ్డానికి గల పరమార్థం?

ప్రశ్న భారత పత్రికలన్నీ మిమ్మల్ని కాశ్మీర్ విడుదలపొగిడాయి. ఇది పార్లమెంటు ఎన్నికల్లో మీ విజయానికి ఏమైనా తోడ్పడిందా?

జవాబు: అలాగని నేననుకొనడం లేదు. కాశ్మీర్ సమస్య అనేది భారతదేశానికి చాలాప్రధానసమస్య. భారతదేశభద్రత భవిష్యత్తు ఆసమస్యకు ముడిపడివుంది. భారతదేశం మీద దురాక్రమణజరిగిందన్నమాటవాస్తవం భారతప్రభుత్వం భద్రతాసమితి ముందు భూభాగాన్ని గురించి వాదించడానికి రాలేదు. ఈ దురాక్రమణపై సభవారి దృష్టిని మళ్లించడానికే వచ్చింది.

మరొక బ్రిటిష్ అణ్వాస్త్ర పరీక్ష

జపానులో తీవ్ర సంచలనం

టోకియో, జూన్ 1

క్రిస్మస్ దీవిలో బ్రిటిష్ మరొక పెద్ద హైడ్రోజన్ బాంబు పాటవపరీక్ష జరిపింది.

ఈ వేళ తెల్లవారేసరికల్లా ఈ వార్త జపానుమంతటా వ్యాపించింది. జపానులోని వాతావరణ పరిశోధక కేంద్రాలు కూడా ఈ వార్తను ధృవపరిచాయి.

దానితో జపానులో తీవ్ర సంచలనం బయలుదేరింది. ఈ మధ్య క్రిస్మస్ దీవుల్లో బ్రిటన్ తన మొదటి హైడ్రోజన్ బాంబు పరీక్ష జరిపినందుకే జపాను ప్రజలు అట్టుడికినట్లుడికిపోయారు. టోకియోలోని బ్రిటిష్ రాయబార కార్యాలయంలోకి విద్యార్థులు ప్రవేశించి నిరసన ప్రదర్శనాలు జరిపారు.

ఈసారి కూడా బ్రిటిష్ రాయబార కార్యాలయంవద్ద పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనాలను జరుపబోతున్నామని జపాను సోషలిస్టుపార్టీ ప్రతినిధి తెలిపాడు.

జపాను ఎంతవద్దంటున్నా లెక్కచేయకుండా బ్రిటన్ ఇలా రెండవసారికూడా అణ్వాస్త్ర పరీక్ష జరపడం చాల విచారకరమని ప్రభుత్వ పక్షమయిన కన్సర్వేటివ్‌పార్టీ ప్రతినిధి ఖండించారు.

హైద్రాబాద్‌లో వీధి దీపాల కొరత

మేయర్‌కు వినతిపత్రం

హైద్రాబాద్, జూన్ 1

రాంనగర్, హిమాయత్‌నగర్, భూలోకపురం ప్రాంతాలలో వీధి దీపాలు, నీటి కొళాయిలూ, మరుగుదొడ్లు జనాభాకు తగినన్ని లేవనీ, ఇందువల్ల ఆ ప్రాంతాలలోని ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారనీ వార్డు ప్రతినిధివర్గం హైద్రాబాద్ మేయర్‌కు, కమిషనర్‌కు ఒక వినతిపత్రం ఇచ్చారు.

వినతిపత్రంలోని విషయాలనువిచారించి తగిన చర్య తీసుకొంటామని మేయరూ, కమిషనరూ ప్రతినిధివర్గానికి తెలియజేశారు. ప్రతినిధివర్గంలో శ్రీ యస్. సాంబమూర్తి, టి. గండయ్య, బి. కృష్ణగాడ్లు ఉన్నారు.

ఈజిప్టు పత్రికలపై నిషేధం

అమ్మన్, జూన్ 1

జోర్డాన్ ప్రభుత్వం నేడు ఈజిప్టు పత్రికలన్నింటిమీదా నిషేధాన్ని విధించింది. దినపత్రికలూ, వారపత్రికలు మొదలైన వాటికన్నిటికీ, అవి ఏ భాషలో వెలువడుతున్నాసరే, ఈ నిషేధం వర్తిస్తుందని జోర్డాన్ రక్షణ శాఖవారు ప్రకటించారు.

"ప్రజాందోళనకు ప్రభుత్వం తలొగ్గక తప్పిందికాదు"

కొన్ని అదనపుపన్నులరద్దుపై కమ్యూనిస్టు నాయకుడు శ్రీ డాంగే వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 1

కేంద్ర ఆర్థిక మంత్రి విధించిన అధిక పన్నులలో కొన్నింటిని రద్దు చేయించటానికి దేశవ్యాప్తమైన ఆందోళనోద్యమం, కలకత్తాలోసార్వజనీన సమ్మె జరపవలసి వచ్చిందని లోక్‌సభలో కమ్యూనిస్టు పక్ష నాయకుడు శ్రీ ఎస్. ఎ డాంగే పేడిక్కడ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు.

ప్రజాభిప్రాయానికి తలొగ్గి అదనపు పన్నులను కొన్నింటిని రద్దు చేసిన ప్రభుత్వాన్ని తాను అభినందిస్తున్నానని ఆయన చెప్పారు. అయితే ప్రభుత్వం మొదట్లోనే యీపని చేసివుంటే ఎంతో బాగుండేదన్నారు.

రానున్న కొలది మాసాలలోను అనేక రాజకీయ పార్టీలు, అన్ని ట్రేడ్ యూనియన్లూ, అన్ని వర్గాల ప్రజలు కలిసి అధిక జీతనాలకోసం ఐక్యాందోళన ప్రారంభించటం తథ్యమన్నారు. అలాగే తిండి దొంగలను బయటపెట్టి, ఆహార నిల్వలను బయటకులాగి, దొంగనిల్వల వ్యతిరేక బిల్లును తు. చ. తప్పకుండా వారు అమలు జరిపిస్తారని శ్రీ డాంగే చెప్పారు. రెండో పేకమిషన్ నియమించాలని ప్రభుత్వోద్యోగులు తమ ఆందోళనను యింకా ఎక్కువ చేస్తారన్నారు. ప్రస్తుతం రైల్వేలలోని పని నిబంధనలను రద్దుచేయాలన్న ఆందోళన కూడా పెరుగుతుందన్నారు. సంయుక్త మహారాష్ట్రం, మహాగుజరాత్ రాష్ట్రాల స్థాపనకోసం ప్రజోద్యమం సాగుతుందన్నారు.

ఈ ప్రజోద్యమానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తుందా అని విలేఖరులు ప్రశ్నించగా, ట్రేడ్ యూనియన్లు అన్నీకలిసి ఈ ప్రజోద్యమానికి సారథ్యం వహించవచ్చునని శ్రీడాంగే సమాధానమిచ్చారు. కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం వహించినా వహించకపోయినా, ప్రజోద్యమం తలెత్తటం తథ్యమన్నారు.

పార్లమెంటు తొలి సమావేశంలో కమ్యూనిస్టుపక్షంనిర్వహించినపాత్రను వివరిస్తూ, పార్లమెంటులో ఇక ట్రేడ్‌యూనియన్ సమస్యలపై కాంగ్రెసువారు వల్లెరుమీద బండితోలటానికి వీలుండబోదన్నారు. జీవిత భీమా కార్పొరేషన్ ఉద్యోగుల సమస్యపై చర్చలో ఇదే స్పష్టమైందన్నారు.

రక్షణ వ్యయంలో దాదాపు నూటికి 25 వంతులు దుబారా జరుగుతోందనీ, దానిని నివారించ వీలుందని శ్రీ డాంగే అన్నారు.

రెండో పంచవర్ష ప్రణాళికను అమలు జరపటానికి అవసరమైన ధనాన్ని సేకరించటానికి కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయ సూచనలు చేస్తుందని శ్రీ డాంగే వివరించారు.

ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉక్కు కర్మాగారం లేకుండా చేసుకోవడం తప్పనిప్రధాన మంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనను ప్రస్తావించి, కమ్యూనిస్టులు ఉక్కుకర్మాగారం అవసరమని పదే పదే నొక్కి చెప్పారని శ్రీ డాంగే అన్నారు. అప్పుడు మాకు (కమ్యూనిస్టులకు) ఆర్థిక విషయాలు బొత్తిగా తెలియవని వారు కాంగ్రెసు అవహేళన చేశారన్నారు.

రక్షణశాఖలో పొదుపు ఏవిధంగా చేసుకోవచ్చునని ప్రశ్నించగా చిన్న చిన్న ఆయుధాలు భారతదేశంలోనే తయారు చేసుకోవచ్చునని చెప్పారు. అయితే వాటిని లండన్, న్యూయార్కులనుండే తెప్పించుకోవడం కొన్ని వర్గాలకు ఇష్టమన్నారు.

రక్షణ కార్మిక సమాఖ్య ఈ సమస్యపై ఒక వినతిపత్రం తయారు చేసిందన్నారు. స్టోర్సుకు ఖరీదు చేయడంలో చాల దుబారా జరుగుతున్నదనికూడా చెప్పారు.

బొంబాయిలో 'ఫ్లూ' వల్ల 9 మంది మృతి

రోజూ 20 వేల మందికి చికిత్స

బొంబాయి, జూన్ 1

బొంబాయిలో ఇన్‌ఫ్లుయంజా వ్యాధితో ఈరోజు తొమ్మిదిమంది చనిపోయారు. వీరిలో కొందరు ఆస్పత్రిలో చేరిన కొద్దిక్షణాలలోనే మరణించారు. వ్యాధి తగ్గినట్లు కనపడటంలేదు.

ఇన్‌ఫ్లుయంజా సోకినట్లు కనపడిన వారికిల్లా మందు ఇస్తున్నారు. ఈ విధంగా వివిధ ఆస్పత్రులలో రోజుకు 20 వేలమంది చొప్పున మందు పుచ్చుకొంటున్నారు. కార్పొరేషన్ కు రోజుకు 50 వేల రూపాయలచొప్పున ఖర్చు అవుతున్నది.

నిమోనియా వ్యాధివల్ల నగరంలో ప్రతిరోజూ సగటున 12 లేక 13 మంది చనిపోతున్నట్లు మునిసిపల్ కమిషనర్ పేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

జవుళిమిల్లు, ఓడరేవు పనివారు చాలమంది గైరుహాజరవుతున్నారు. విద్యుచ్ఛక్తి, రవాణాశాఖలలో కార్మికుల హాజరు తగ్గిపోతున్నది. కొన్ని జవుళి మిల్లులలో నూటికి 20 మంది పనికి హాజరు కాలేదు. 40 బస్సులు, ట్రాములు సిబ్బంది కొరతవల్ల నిలచిపోయాయి.

మద్రాసులో పరిస్థితి

మద్రాసులో అనేక వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీలు సిబ్బంది కొరతవల్ల సరిగా పనిచేయడంలేదు.

నేటి మధ్యాహ్నం 'ఫ్లూ' వ్యాధికి గురియైన 40 మందిని ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం 820 మంది చికిత్సపొందుతున్నారు.

మధురలో 'ఫ్లూ' వ్యాధి తీవ్రంగా వుంది.

కలకత్తాలో ఇద్దరి మృతి

కలకత్తాలో 'ఫ్లూ' వ్యాధివల్ల నేటి సాయంకాలం ఇద్దరు మరణించారు. 'ఫ్లూ' వ్యాధివల్ల చావులు ఈ ఇద్దరితో ప్రారంభమైనాయి.

ఈ వారంలో వెయ్యిమందికి ఈ వ్యాధి సోకినట్లు కార్పొరేషన్ ఆరోగ్యశాఖఅధికారులదృష్టికివచ్చింది

ఢిల్లీలో వ్యాధి వ్యాప్తి

పోయిన రెండు మూడు రోజులలోను ఢిల్లీలోముఖ్యంగా జనసమ్మర్దం గల ప్రదేశాలలో 'ఫ్లూ' వ్యాధి ఎక్కువైంది.

మాస్కో, జూన్ 1

సోవియట్ ప్రధాని మార్షల్ బుల్గానిన్ నేడు భారత రాయబారి శ్రీ కె. పి. యస్. మీనన్‌తో సంభాషణలు జరిపారని 'టాస్ వార్తా' సంస్థ ప్రకటించింది.

స్త్రీల విద్యాభివృద్ధికి ఘోషాపద్ధతి

ఆటంకం కారాదు

ఉయ్యూరు సభలో శ్రీమతి హజరాబేగం సూచన

ఉయ్యూరు, జూన్ 2

స్త్రీల విద్య, విజ్ఞానాభివృద్ధులకు ఘోషాపద్ధతి ఆటంకంగా పరిణమించరాదని రాత్రి ఇన్పుట వీర్పాటు చేయబడిన బహిరంగసభలో అఖిలభారత మహిళాసమాఖ్య ఉపాధ్యక్షురాలు శ్రీమతి హజరాబేగం ఉపన్యసించారు. దేశంలో సగభాగంగానున్న స్త్రీలు విజ్ఞానవంతులు అయినప్పుడు దేశపునర్నిర్మాణానికై జరిగే కృషి తేలిక కాగలదనికూడా స్పష్టంచేశారు.

ఈ బహిరంగసభ అఖిల భారత మహిళా సమాఖ్య ద్వితీయ వార్షికోత్సవ ప్రచారసందర్భంలో స్థానిక మహిళాసంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేయబడింది. సభకు శ్రీమతి శాంతమ్మగారు అధ్యక్షత వహించారు.

శ్రీమతి హజరాబేగం తమ ఉపన్యాసంలో బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు ఈజిప్టులో జరిపిన దీభత్సాన్ని వివరిస్తూ తమ మాతృదేశ రక్షణకు మహిళలు వహించిన వీరోచితమైన పాత్రను వివరించారు. అఖిల భారత మహిళా సమాఖ్య కార్యకలాపాలను సమీక్షించారు.

తర్వాత జిల్లా మహిళాసంఘ కార్యదర్శిని శ్రీమతి నాగళ్ళ రాజేశ్వరమ్మగారు విజయవాడలో జూన్ 6 నుండి 9 వరకు జరగనున్న మహిళా మహాసభను విజయవంతం చేయాలని అభ్యర్థించారు.

సభాధ్యక్షులు శ్రీమతి శాంతమ్మగారు మాట్లాడుతూ మహిళా మహాసభకు రు. 70 లు విరాళమిచ్చిన దాతలకు కృతజ్ఞత తెలిపారు.

స్వాతంత్ర్య సమర శతవార్షికోత్సవం

ఆగస్టులో జరపాలని కేరళ ప్రభుత్వ నిర్ణయం

తిరువనంతపురం, జూన్ 1

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ శతవార్షికోత్సవం ఆగస్టు నెలలో జరపాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది.

మంత్రివర్గం నిన్నటిరోజు సమావేశమై రాష్ట్రవ్యాప్తంగా ఇందుకు ఒక కార్యక్రమాన్ని రూపొందించే నిమిత్తం శాసనసభ్యులను, స్థానిక సంస్థల, రాజకీయపార్టీల ప్రతినిధులను జూన్ 23 వ తేదీన సమావేశపరచాలని నిశ్చయించింది.

ఉత్సవాలు నిర్వహించడానికి ఆ సమావేశంలో అఖిల కేరళ కమిటీని ఎన్నుకొంటారు.

సోషలిస్టుపార్టీ సత్యాగ్రహం సందర్భంలో యు, పి.లో ఇంతవరకు 20,29 మంది అరెస్టయినారు.

మౌలానా భషానీ నిరాహారదీక్ష

ఆహారధరలు పెరిగినందుకు

ఢాకా, జూన్ 1

తూర్పు పాకిస్తాన్ అవామీలీగ్ అధ్యక్షులు మౌలానా భషానీ, నేడు పారంభోజుల ఆత్మపరిశుద్ధ్య నిరాహార వ్రతం పూనారు. ఆహార ధాన్యాల ధరల పెరుగుదలవల్ల అవస్థపడుతున్న ప్రజలకోసం ఆయన ఈ దీక్ష ప్రారంభించారు.

నిన్న జరిగిన సమావేశంలో ప్రభుత్వమూ, పార్టీ ప్రతినిధులూ, అధికారులూ ఆహారసమస్యా పరిష్కారానికి అనుక్షణమూ పడం తనకు సంతృప్తి కలిగించిందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, పరిస్థితి అదుపులోకి వస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు.

మాంటిసోరి శిశు విద్యాలయము

తాడంకివారివీధి, విజయవాడ - 2

జూన్ 10 వ తేదీన తెరవబడును. కొత్త విద్యార్థులను చేర్చుకొనుటకు జూన్ 14, 15 తేదీలలో పరీక్ష జరుపబడును. తర్వాత చేర్చుకొనబడరు. 1 వ తరగతి నుండి 1 వ ఫారంవరకు క్లాసులు గలవు. మూడుసం॥ల పిల్లలకు నర్సరీ తరగతి కలదు. మాంటిసోరి పద్ధతులమీద విద్యాబోధన జరుగును. రాత్రి పోకలకు వ్యాను ఏర్పాటు, 6సం॥ లపై పిల్లలకు హాస్టలు సౌకర్యము కలవు. వివరములు ప్రిన్సిపాలు గారికి వ్రాసిన తెలియును

ప్రకటన

తెనాలి తాలూకా గుడివాడ గ్రామ కాపురస్తురాలు కావూరు రాజేంద్రప్రసాద్ ధార్య సూర్యాంబ అందరికీ తెలియజేయడమేమనగా, నా భర్త రెండు నెలల నుండి దుష్టసహవాసములవల్ల దుర్వ్యవసనములకు లోనైయున్నాడు. నాకు ఒక కొడుకు, కూతురు గలరు. నా భర్త కుటుంబశ్రేయస్సుగోరి బుద్ధిపూర్వకముగా 14-5-57 తేదీన తన ఆస్తిని పూర్తిగా నన్ను మైనరు కొడుకుకు గార్డియన్‌గా నియమించి పుత్రసంతానమునకు దఖలు పరచదగినది తదుపరి చెడ్డస్నేహితులు అయిన్ని తీవ్రంగా దుర్వ్యసనాల్లోకి అవగా జూదము, వ్యభిచారము, త్రాగుడు అధ్యాసాల్లోకిదించి తప్పుడు ప్రాంశరీనోట్లు సృష్టించి నావిల్లల ఆస్తిని భంగపరచవలెననే దురుద్దేశ్యములో పున్నట్లు తెలుస్తున్నది నాకు ఆస్తి దఖలు పరచుటకుముందు తేదీలు వేసి నకలు తేదీలు వేయించి ఆయనచేత నోట్లు వ్రాయించుకున్నట్లు తెలుస్తున్నది నాకుటుంబమునకు అప్పులు చేయవలసిన అవసరములేదు. నాకుటుంబమునకు ఎలాంటి అప్పులు లేవు. నా భర్తకు ఆస్తిలేదు. ఆయనచేసిన ఋణములకు నేనుగాని నావిల్లలుగాని బాధ్యులుకారు. ఇట్లు,

కావూరు సూర్యాంబ



ఐరిస్ సిరాలు

ఫౌన్‌టెన్ కలాలకు చాలా మంచివి.

తయారు చేయువారు:

Research Chemical Laboratories,
Madras-4, Bangalore-3, New Delhi-1



కాంగ్రెసు స్థితిగతులు

అఖిలభారత కాంగ్రెసుసంఘ సమావేశంలో ప్రధాని నెహ్రూ నిశిత విమర్శ

న్యూఢిల్లీ, జూన్ 1

కాంగ్రెసువాదులలో రాష్ట్రీయ దురభిమానం, కులతత్వం, మతతత్వం అత్యంత వికృత రూపం ధరించినవనీ, కాంగ్రెసువారు ప్రజల నుంచి పూర్తిగా దూరమై పోతున్నారనీ నేడిక్కడప్రారంభమైన అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశంలో ప్రధాని నెహ్రూ ప్రసంగిస్తూ పేర్కొన్నారు.

కాంగ్రెసు సంస్థ పునాదులను విస్తృతపర్చి, పటుతర మొనర్చాలన్న దృష్టితో కాంగ్రెసు నిబంధనావళికి కాంగ్రెసు కార్యవర్గం సూచించిన సవరణలపై మాట్లాడుతూ శ్రీ నెహ్రూ యింకా యిలా అన్నారు.

కాంగ్రెసు ఈనాడు ఒక మరంలాగా తయారైంది. నేనూ, శాస్త్రీ మరికొందరూ ఆ మరానికి అధిపతులంగానూ, సహాంతులంగానూ తయారయ్యాం గద్దెను అంటిపెట్టుకొని కూర్చుంటున్నాం. కొత్తవారిని మరంలోకి రానివ్వటంలేదు. ఒకవేళ కొత్తవారు లోనికి ప్రవేశించినా వారికి అంత ప్రముఖస్థానం యివ్వటంలేదు.

గతంలో కాంగ్రెసు నిర్వర్తించిన పాత్రను వివరించిన పిమ్మట, ప్రధాని నెహ్రూ కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితిని ఇలా వర్ణించారు.

కాంగ్రెసు ఈనాడు సరియైనస్థితిలోవున్నదని చెప్పజాలం. నిజానికి అది అవ్యవస్థలో వున్నదని చెప్పాలి. వాస్తవానికి అనేక ప్రాంతాలలో కాంగ్రెసు సంస్థ లేదనేచెప్పాలి. ప్రదేశ్ కాంగ్రెసు సంఘాలు సక్రమంగా పనిచేయటం అంత ముఖ్యమైన విషయంకాదు. కాంగ్రెసువంటి సంస్థకు పునాదులు గట్టిగావుండాలి. అయితే ఆ పునాదులే ఈనాడు చాలా అనిశ్చితంగా వున్నాయి.

కాంగ్రెసు సభ్యత్వం గురించి ప్రస్తావించి శ్రీ నెహ్రూ యిలా చెప్పారు.

పేరుకు 2కోట్ల సభ్యత్వమైతేవుంది. నిజానికి వారంతా కాంగ్రెస్ సభ్యులనటానికి వీలులేదు. ఆ రెండుకోట్ల మందికి ఎదులు వారిలో నూటికి పది మంది నిజమైన సభ్యులు వుంటే కాంగ్రెసు సంస్థకు ఎంతో బలం చేకూరుతుంది."

సవరణలపై చర్చలు

అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశం ఈవేళ ఉదయం ప్రారంభమైంది. ఉదయం సమావేశంలో కాంగ్రెసు సంస్థ నిబంధనావళికి కార్యవర్గం సూచించిన సవరణలపై చర్చ జరిపారు.

ఈ సవరణలను కార్యవర్గం తరపున శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ప్రతిపాదించారు. శ్రీ జగ్‌జీవనరామ్ బలపర్చారు.

కార్యవర్గం సూచించిన సవరణలలో, వివిధస్థాయిలలోనూ కాంగ్రెసు సంఘాల ఎన్నికలు యిప్పటిలా ప్రత్యక్షంగాకాక, పరోక్షంగా జరిపించాలన్నది ముఖ్యమైనది.

అలాగే ట్రేడ్ యూనియన్లలోను, రైతు, కూలీ సంఘాలలోను, ఇతర ప్రజాభ్యుదయ కార్య క్రమాలలోను పనిచేస్తున్నవారికి కాంగ్రెసు సంస్థలో స్థానం కల్పించటానికి మరొక సవరణ ఉద్దేశించబడింది.

ఈ సవరణలపై నేడు మూడు గంటలపాటు చర్చ జరిగింది. అనేక మంది సవరణలను బలపర్చారు. అయితే శ్రీ ఎస్. వి. గాడ్గిల్, శ్రీ మొసలికంటి తిరుమలరావుగార్లు పరోక్షపు ఎన్నికల పద్ధతిని వ్యతిరేకిస్తూ ప్రసంగించారు.

ఆ తర్వాత రహస్య సమావేశం గంటన్నరపాటు జరిగింది. కాంగ్రెస్ నిబంధనావళిని మార్చవలసిన అవసరం గురించి మళ్ళీ ఈ సమావేశంలో ప్రధాని నెహ్రూ ప్రసంగించారట. పరిస్థితులకు తగినట్లు మార్పులు చేయకపోతే, కాంగ్రెసు జామరూపాలు లేకుండా పోతుందని ఆయన హెచ్చరించారట.

నిబంధనావళి మార్పులను పరిశీలించడానికి ఉపసంఘాన్ని నియమించాలనే సూచనను సభ్యులు చాల మంది అంగీకరించినట్టు తెలుస్తోంది. రేపు మళ్ళీ కమిటీ సమావేశమైనపుడు ఈ విషయమై నిర్ణయంతీసుకుంటారు.

మావోనిఆహ్వానించాలన్న సూచనకు బ్రిటిష్ ప్రధాని విముఖత

లండన్, జూన్ 1

మావో-సే-టుంగ్‌ని, చౌఎన్‌లైనీ బ్రిటనుకు ఆహ్వానించాలని నిన్న కామన్సు సభలో లేబర్ విలియమ్స్ అనే లేబరు సభ్యుడు సూచించారు.

బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్ ఈ ప్రతిపాదనను నిరాకరించారు. "ప్రస్తుత పరిస్థితిలో ఈ సూచనను పాటించడం మంచిదనుకోను" అని ఆయన అన్నారు.

లంచగొండితనం నిర్మూలనకు ప్రత్యేక శాఖ

కేరళ ప్రభుత్వం ఏర్పాటు

తిరువనంతపురం, జూన్ 1

అవినీతి, లంచగొండితనాల నిర్మూలనకు కేరళ ప్రభుత్వం ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటుచేసింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులలో ఒకరు ఈ శాఖకు అధిపతిగా నియమించబడ్డారు.

అవినీతి, లంచగొండి తనాలకు సంబంధించిన కేసులన్నింటిపైన దర్యాప్తు జరపటానికి జిల్లా జడ్జీ లేక పెన్షన్ జడ్జీ హోదాగల విచారణాధికారిని ప్రభుత్వం నియమిస్తుంది.

అవినీతి, లంచగొండి తనాలకు సంబంధించిన కేసుల విషయంలో దర్యాప్తు సరిగా జరిగేటట్లు ఈ ప్రత్యేక శాఖకు అధికారిగా నియమించబడిన ప్రభుత్వ కార్యదర్శి చూస్తూంటారు.

ఇప్పటిదాకా పోలీసుశాఖలోని కొందరు ఉద్యోగులు అవినీతి, లంచగొండితనాలకు సంబంధించిన కేసులపై దర్యాప్తు జరిపే పద్ధతి మాత్రమే దేశమంతటా అమలులో వుంది.

గనులకు లోహాలకు సలహాసంఘం

ఆంధ్ర పరిశ్రమలమంత్రి అధ్యక్షతను ఏర్పాటు

హైద్రాబాద్, జూన్ 1

ఆంధ్రప్రభుత్వం గనులకు, లోహాలకు ఒక సలహాసంఘాన్ని నియమించింది. పరిశ్రమలమంత్రి దీనికి అధ్యక్షులుగా వుంటారు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులు ఏడుగురు, అనధికార ప్రతినిధులు నలుగురు సభ్యులుగా వుంటారు.

అనధికార సభ్యుల పేర్లు ఇవి: శ్రీ బి. రామచంద్రారెడ్డి, (సింగరేణి బొగ్గుగనుల కంపెనీ జనరల్ మేనేజరు) ఆంధ్ర యూనివర్శిటీ భూగర్భశాస్త్ర అధ్యక్షుడు, శ్రీ సోమయాజులు (దక్షిణ భారత లోహసంస్థ అధ్యక్షుడు).

ఈ సలహా సంఘంలో కార్మికులకు ప్రాతినిధ్యం లేదు. (వి. వి.)

అహ్మద్‌నగర్ జిల్లాలో ఖర్దా గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి, ఐదుగురు చనిపోయారు. వీరిలో ఒకరు స్త్రీ, ఇద్దరు పిల్లలు.

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి. ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు తరపున విశాలాంధ్ర ప్రెస్‌లో ముద్రితము, విజయవాడ - 2